

GET THE LATEST UPDATES AND NEWS DIRECTLY THROUGH THE WHATSAPP

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం – ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 87 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 06 జూన్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్



ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా

## పూర్తి మద్దతు

- ఉక్రెయిన్ యుద్ధం: రష్యాకు కిమ్ జాంగ్ ఉన్ బేషరతు మద్దతు ప్రకటన
- పాంగ్యాంగ్‌లో కిమ్ జోంగ్ ఉన్‌తో రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు భేటీ
- అన్ని అంతర్జాతీయ రాజకీయ అంశాల్లో రష్యా వైఖరికి ఉత్తర కొరియా మద్దతు అని కిమ్ స్పష్టం

**ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతంపై చర్చ**

**రష్యా తరపున ఉక్రెయిన్‌లో ఉత్తర కొరియా సైనికుల పోరాటం**

ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న సైనిక చర్య విషయంలో రష్యాకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మరోసారి స్పష్టం చేశారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు పాంగ్యాంగ్‌లో కిమ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీవ్‌తో జరుగుతున్న పోరులో రష్యాకు తాము బేషరతుగా మద్దతునిస్తున్నామని కిమ్ పునరుద్ఘాటించినట్లు ఉత్తర కొరియా అధికారిక మీడియా వెల్లడించింది. "ఉక్రెయిన్‌తో యుద్ధం సహా అన్ని కీలకమైన అంతర్జాతీయ రాజకీయ సమస్యలలో రష్యా వైఖరినీ, ఆ దేశ విదేశాంగ విధానాలకు ఉత్తర కొరియా బేషరతుగా మద్దతు ఇస్తోంది" అని కిమ్ జోంగ్ ఉన్ పేర్కొన్నారు. 2లో

పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా

## ముందుకు రావాలి

**ప్రకృతిని కాపాడుకుంటేనే మనుగడ**

**అదే మనలను కాపాడుతుంది**

**సిఎం రేవంత్ రెడ్డి పిలుపు**


మంత్రి సురేఖ అధికారులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు.

హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కార్యాలయం తరఫున ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. ప్రకృతిని మనం కాపాడితే, అదే మనల్ని కాపాడుతుందని సీఎం స్పష్టంగా తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణగా ఉన్న నేపథ్యంలో, ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించే దిశగా కృషి చేయాలని, దానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయాలని సీఎం కోరారు. సహజ వనరుల సంరక్షణకు ప్రతిసారీ ప్రభుత్వం కట్టు-బడి ఉంటుందని, రాబోయే తరాల కోసం ఈ వనరులను నిలుపుదల చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఓ ప్రకటనను విడుదల చేశారు. చెట్లను పెంచాలి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. మన ఆరోగ్యం కోసం కాదు, మన భవిష్యత్ తరాల భద్రత కోసమూ పర్యావరణాన్ని కాపాడాలని అంటూ ఆమె పిలుపునిచ్చారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న వేళ, రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వన మహోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత ఏడాది అనుభవాల నేపథ్యంలో, ఈసారి మరింత విస్తృతంగా చెట్ల నాటే కార్యక్రమాలను చేపట్టేందుకు



## నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

**నేటి విచారణకు హాజరు కానున్న ఎంపి ఈటెల**

**9న హరీష్ రావు, 11న కెసిఆర్ విచారణకు హాజరు**

హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):

తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చింది. వీరిని విచారించేందుకు గురువారం కాళేశ్వరం కమిషన్ హైదరాబాద్ కు చేరుకుంది. విచారణలో భాగంగా శుక్రవారం బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ను ప్రశ్నించనుంది. మిగతా 2 లో

25 కోట్లమందిని పేదరికం నుంచి

## బయటపడేశాం

- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డిఎ కృషి
- ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి



న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):

పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశిరచుకొని.. వాటిని సాధించేందుకు ఉత్సాహంగా పనిచేయాలని సహచరులకు సూచించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.



## అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కరణ

**రామ దర్బార్ విగ్రహాలకు వేదోక్తంగా ప్రాణప్రతిష్ట**

అయోధ్య,జూన్5(సమయజ్యోతి):

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో గురువారం మరో అద్భుతం చోటుచేసుకుంది. అంగరంగ వైభవంగా రామమందిర మొదటి అంతస్థులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణ, హవనంతో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి సముదాయంలో రాజారామ్, ఇతర దేవతలను ప్రతిష్టించారు. గతేడాది జనవరిలో జరిగిన మొదటి ప్రాణ ప్రతిష్ఠ తర్వాత జరిగిన రెండవ కార్యక్రమం ఇది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుక జూన్ 3న ప్రారంభమైంది. జూన్ 5న ముగింపు వేడుకతో ముగుస్తుంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆంజనేయ సేవా ట్రస్ట్ నిర్వహించింది. రామాలయంలోని మొదటి అంతస్తులో రామ దర్బార్ విగ్రహాలకు (రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు) ప్రాణ ప్రతిష్ఠతో పాటు మరో ఏడు దేవాలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. ఈ ప్రాణ ప్రతిష్ఠ ఆచారాన్ని చందౌలి జిల్లాకు చెందిన ప్రసిద్ధ పండిట్ జైప్రకాష్ నేతృత్వంలో 101 మంది వేద ఆచార్యులు నిర్వహించారు.

## ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సీరియస్

**హుటాహుటిని ఎఐజి ఆస్పత్రికి తరలింపు**

**ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్న హరీష్ రావు**





హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను వెంటనే గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. గుండె సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురైనట్టు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకంగా ఉన్నట్టు సమాచారం. మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు భారాస నేతలు ఏఐజీ ఆసుపత్రికి చేరుకుని గోపీనాథ్ ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుతం మాగంటి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు-సమాచారం. ఏఐజీ ఆస్పత్రి వర్గాలు హెల్త్ బులిటెన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యారని తెలియటంతో మాజీ మంత్రి హరీష్ రావుతోపాటు- పలువురు బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాగంటి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.



## ఇథనాల్ కంపెనీకి వ్యతిరేక ఆందోళన

- 57మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- 12మంది అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు

జోగులాంబ గద్వాల,జూన్5(సమయజ్యోతి):

గద్వాల జిల్లా రాజోలి మండలం, పెద్ద ధన్వాడ గ్రామ సమీపంలో 35 ఎకరాల్లో గాయత్రి ఇథనాల్ కంపెనీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళన కేసులో 57 మంది రైతులపై కేసులు నమోదు చేశారు. అందులో 12 మంది రైతులను గురువారం రిమాండ్‌కు తరలించగా 40 మంది రైతులు పరారీలో ఉన్నారని, 5 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణం దగ్గర 12 గ్రామాల రైతులు కంపెనీ నిర్మాణం చేపట్టే ప్రదేశంలో భారీ వాహనాలను, యంత్ర సామాగ్రిని, కూలీల పూరి గుడిసెలు, కంటైనర్లను తగులబెట్టి సుమారు రూ 40 లక్షల ఆస్తిని నష్టపరిచినట్లు-యజమాని మంజునాథ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మిగతా 2 లో



## మంత్రి కొండా సురేఖకు స్వల్ప అస్వస్థత

**కేబినేట్ భేటీకి వెళుతుండగా ఘటన**

హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):

తెలంగాణ దేవాదాయశ్శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సచివాలయంలో మంత్రి కళ్లు తిరిగి పడిపోయారు. ఉదయం నుంచి ఆహారం తీసుకోకపోవడంతో ఆమె పడిపోయారు. ఏమి తినకపోవడంతోనే మంత్రికి షుగర్ లెవెల్స్ పెరిగాయి. వెంటనే మంత్రి సురేఖ వ్యక్తిగత సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంత్రి సురేఖకు వ్యక్తిగత సిబ్బంది ఆహారం తెచ్చిఇచ్చారు. ఆహారం తీసుకోవడంతో మళ్లీ తేరుకున్నారు కొండా సురేఖ. కేబినేట్ మావేశానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో పాల్గొనడానికి మంత్రులు వచ్చారు. ఈ క్రమంలోనే కొండా సురేఖ అస్వస్థతకు గురయ్యారు. సచివాలయంలో అస్వస్థతకు గురైన మంత్రి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పరామర్శించారు. ఆమె ఆరోగ్యపరిస్థితిపై సీఎం, మంత్రులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో కేబినెట్ సమావేశం ప్రారంభమైంది.

# చెత్త, ముళ్ల పొదల్లో పసికందులను పడేయడం దారుణం

**వారికోసం అక్కడక్కడా ఊయలలుఏర్పాటు చేసే యోచన**

**మహిళా స్వచ్ఛంద సంస్థలతో త్వరలో సమావేశం**

**మేధోమథన సదస్సులో మంత్రి సీతక్క వెల్లడి**

హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):

త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని.. చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా.. ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని అన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మధన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రెండు రోజుల పాటు- జరిగిన మేధో మధన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మేధో మధన సదస్సు విజయవంతం అయ్యిందని.. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చున్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ విలువైన సలహాలు ఇచ్చారని అన్నారు.్ఞ÷లంగాణ ఏర్పాటై 10 సంవత్సరాలైనా ఇప్పటికీ బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్‌ను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రూల్స్‌ను అడాప్ట్ చేసుకుంటామని ప్రకటించారు.మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామని చెప్పారు. వారి సలహాలు సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామని వెల్లడించారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామనన్నారు. స్వీయ రక్షణ టీంలుగా స్నేహ కమిటీలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళ, బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామని అన్నారు. బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ సభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారని అన్నారు. ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింపజేశారని తెలిపారు. అంగన్వాడీ సేవలకు ఆరాధ్యులుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇందిరా గాంధీ నిలిచారని చెప్పుకొచ్చారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. ఈ ఏడాది వేయి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్వాడీ గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని.. కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్వాడీ సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతీ శుక్రవారం అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను , హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క వెల్లడించారు.



# తొక్కిసలాట ఘనటపై పోలీసుల కేసు నమోదు

**దర్యాప్తును సిఐడికి అప్పగించిన ప్రభుత్వం**

**ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశం**

బెంగళూరుజూన్5(సమయజ్యోతి):

ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్-టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు- పోలీసులు వెల్లడించారు. నేరపూరిత నిర్లక్ష్యం కేసులో ఈ సంస్థలను నిందితులుగా పేర్కొని ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కోర్టుకు ఇచ్చిన స్టేటస్ రిపోర్టులో ఈ విషయాన్ని ప్రభుత్వం పేర్కొంది. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఈ కేసును దర్యాప్తు చేస్తుందని తెలిపింది. తదుపరి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు- చేయాలన్న ఆదేశాలతో పాటు ఎఫ్ఐఆర్ కాపీని సీఐడీకి అప్పగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ విషాద ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరుపుతున్నట్లు- ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాటకు కారణాలేంటి? తలెత్తిన లోపాలు, జవాబుదారీతనం వంటి అంశాలను పరిశీలించేందుకు డిప్యూటీ- కమిషనర్, బెంగళూరు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ 15 రోజుల్లోగా విచారణ చేస్తారని ప్రభుత్వం తెలిపింది. స్టేడియం వద్ద 2.5లక్షల మంది ప్రజలు గుమిగూడారని, బెంగళూరు నగర పోలీసుల నుంచి 1380 మంది సిబ్బంది, 13 కేఎస్ఆర్పీ ప్లాటూన్లు ని మోహరించి విస్తృత ఏర్పాట్లు- చేసినట్లు- ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. కానీ, జనం భారీగా తరలిరావడంతో పలు గేట్ల వద్ద తొక్కిసలాట జరిగి 11మంది మృతిచెందగా.. 56మంది గాయపడ్డారని తెలిపింది.క్షతగాత్రుల్లో 50మంది అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందగా, మరో ఆరుగురికి ఇంకా చికిత్స కొనసాగుతున్నట్లు- పేర్కొంది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు- మూడు అగ్నిమాపక వాహనాలు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి-శ్వాట్ యూనిట్లు-, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్ వాహనం మోహరించినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటు-ంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నింటినీ భరించినట్లు తెలిపింది. అలాగే, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సైతం మృతులకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది.

# ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సిందూర్ వివరాలు

**పాక్ ఉగ్రవాద చర్యలను అంతటా ఎండగట్టాం**

**విదేశీ ప్యటన వివరాలను విదేశాంగ మంత్రికి సమర్పిస్తాం**

**తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు**

న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):

ఆపరేషన్ సిందూర్ పరిణామాలు, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న తీరును ఖతార్, సౌత్ ఆఫ్రికా, ఈజిప్ట్, ఐటోపియాలోని ప్రతినిధులకు వివరించామని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. తాము నాలుగు దేశాలు వెళ్లామని లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. వారి నుంచి అపూర్వ స్పందన వచ్చిందని పేర్కొన్నారు. వివిధ దేశాల్లోని మాజీ ప్రధానమంత్రులు, డిప్యూటీ- స్పీకర్లను కలిసి వివరించామని తెలిపారు. తాము కలిసిన ప్రతి దగ్గర భారతదేశం ఎందుకు ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందనే విషయం గురించి వివరించామని అన్నారు. సామాన్యులకు ఎలాంటి నష్టం జరగకుండా ఉగ్రవాదుల స్థావరాలను ఎలా టార్గెట్ చేశామనేది వివరించామని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ప్రధానమంత్రి నరంద్రమోదీ, విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్, కేంద్రమంత్రి కిరణ్ రిజుజు సూచనమేరకు 7 పార్లమెంట్ బృందాలతో కూడిన ఎంపీలందరం 35 దేశాల్లో పర్యటించామని శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌తో భేటీ అవుతామని తెలిపారు. విదేశీ పర్యటన అంశాలను వివరిస్తామని చెప్పారు. ఏ దేశానికి వెళ్లినా పాకిస్థాన్ టెర్రరిజాన్ని పెంచి పోషిస్తున్న అంశాన్ని చెబుతున్నారని లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. భారతదేశం ఎప్పుడూ శాంతిని మాత్రమే కోరుకుందని వివరించారు. ఉగ్రవాదుల స్థావరాలు ధ్వంసం చేశామని చెప్పుకొచ్చారు. పాకిస్థాన్ న్యూక్లియర్ పేరుతో బ్లాక్‌మెయిల్ చేసేలా ప్రయత్నం చేస్తే దానికి భయపడేదిలేదని తాము చెప్పామని అన్నారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా ఆయా దేశాలు ముందు కెళ్లాలని సూచించామని చెప్పారు. టెర్రరిజాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తీరును ఎండగట్టామని లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పాకిస్థాన్‌కు ప్రపంచ దేశాల నుంచి ఆర్థిక సహాయం అందకుండా చూడాలని కోరాం, వారిచ్చే నిధుల ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని చెప్పుకొచ్చారు. విదేశాలకు వెళ్లే బృందాల్లో తప్పకుండా టీడీపీ తరపున వెళ్లాలని సూచించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. టెర్రరిజంపై భారత విధానం ఏంటో పలు దేశాల్లోని ప్రతినిధులకు వివరించామని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# ఊపందుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో

జక్రాన్ పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల మార్కౌట్, భూమి పూజా కార్యక్రమాలు ఊపంద ఉన్నాయని, ఇదే క్రమంలో నిన్న నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని గురువారము నిజామాబాద్ రూరల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సొప్పరి వినోద్ అన్నారు. పేదవాళ్లు సంతోషంగా ముగ్గు పోసుకొని ఇల్లు కట్టుకోవడం జరుగుతుందని రాబోయే రోజుల్లో గ్రామంలో ప్రతి పేదవాడు ఆనందంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, మైనారిటీ మండల అధ్యక్షులు సైకిల్ టెక్స్ అక్బర్, నాయకులు నట్ట తిరుపతి, బొంబాయి రాజు, మాడవేరి శంకర్, గడ్డం గంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

**ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా**

# పూర్తి మద్దతు

ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకోవడం, కుర్స్క్ ప్రాంత పునర్‌నిర్మాణ అంశంతో పాటు పలు ఇతర విషయాలపై నేతలు చర్చించుకున్నారని సమాచారం.షోయిగు ఈ ఏడాది ఉత్తర కొరియాలో పర్యటించడం ఇది రెండోసారి. మార్చి నెలలో కూడా ఆయన కిమ్‌తో భేటీ అయ్యారు. ఆ సమయంలోనూ రష్యా తన సార్వభౌమాధికారాన్ని, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తున్న పోరాటానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని కిమ్ హామీ ఇచ్చారు.కాగా, రష్యా తరఫున తమ సైనిక బలగాలు ఉక్రెయిన్ సైన్యంతో పోరాడుతున్నాయన్న విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్తర కొరియా ధృవీకరించింది. దీనికి కొద్ది రోజుల ముందే రష్యా కూడా ఈ విషయాన్ని బయటపెట్టింది. ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర రక్షణ ఒప్పందంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఇరు పక్షాలు పేర్కొన్నాయి. అయితే ఎంతమంది సైనికులు ఈ పోరులో పాల్గొంటున్నారనే కచ్చితమైన సంఖ్యను వెల్లడించలేదు. సుమారు 10,000 నుంచి 12,000 మంది ఉత్తర కొరియా సైనికులు ఉండవచ్చని ఉక్రెయిన్ నిఘా వర్గాలు, దక్షిణ కొరియా అధికారులు గతంలో అంచనా వేశారు.

మొదటి పేజీ తరువాయి

# నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

తర్వాత ఈనెల 9న బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు.. 11న మాజి సిఎం కెసిఆర్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన నుంచి ప్రారంభోత్సవం వరకు జరిగిన అన్ని అంశాలపై ప్రశ్నల వర్షం కురుపించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతలోపాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ శుక్రవారం నుంచి రాజకీయ ప్రతినిధులను విచారించనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక అంశాలు వంటి వాటిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజినీర్లను, రిటైర్డ్ ఇంజినీర్లను, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి అఫిడవిట్లను స్వీకరించి వాటి ఆధారంగా జస్టిస్ పిసి ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్(కాగ్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-(ఎన్‌డిఎస్ఎ) నివేదికలను కూడా కమిషన్ పరిగణలోకి తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌ను శుక్రవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది. రాజకీయప్రతినిధుల విచారణలు తదుపరి కమిషన్ తుది నివేదికను ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేస్తుంది.

మొదటి పేజీ తరువాయి

# ఇథనాల్ కంపెనీకి వ్యతిరేక ఆందోళన

ఇప్పటికి 57 మందిపై కేసు నమోదు చేయగా 12 మందిని గురువారం అరెస్ట్ చేసి గద్వాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.తెలంగాణ రాష్ట్రంలో నేటికి ఆంధ్ర పెత్తనం ఇంకా పోలేదనడానికి ఈ సంఘటనే నిదర్శనమని, పచ్చని పొలాలో చిత్తూరు జిల్లా మదనపల్లి టౌన్‌కు చెందిన కంపెనీ నిర్వాహకుడు మంజునాథ్ ఇథనాల్ కంపెనీ తెచ్చిన మంట 12 మంది గ్రామాల రైతులు పిల్ల, జల్ల, గూడు విడిసిన పక్షులా బతుకులు ఛిద్రమయ్యాయి. ఈ దుస్థితికి తెచ్చిన యజమానిపై గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఇథనాల్ కంపెనీ వద్దని పలుసార్లు జిల్లా కలెక్టర్‌కు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా మాపై, మా 12 గ్రామాల రైతులపై చిత్తశుద్ధి లేకుండా కంపెనీకి వత్తాసు పలికే అధికారులు, నాయకులపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు- తెలుస్తోంది. ఈ సంఘటనలో 40 మంది రైతులపై కేసులు నమోదు కాగా గురువారం గద్వాల కోర్టులో హాజరు పరచి 12 మంది చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామాలకు చెందిన జయరాం రెడ్డి, రెహమాన్, నాగరాజు, కురువ చెన్నయ్య, డీలర్ నాగరాజు, నరసింహ, కురువ నారాయణ, కురువ శివన్న, కొంకల నరసింహ, కెఎంఎస్ శ్రావణ్, వీరన్న, రాజేంద్ర ప్రసాద్ అ నే రైతులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

## తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు

**స్టేటస్ రిపోర్ట్ వెంటనే ఇవ్వాలి**

**ఆర్సీబి జట్టుకు సన్మానంపై పలు ప్రశ్నలు**

**బెంగళూరు హైకోర్టు ఆదేశాలు జారీ**

బెంగళూరు,జూన్5(సమయజ్యోతి):

చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటనపై సుమోటో కేసు నమోదు చేయాలని బెంగళూరు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. మంగళవారం స్టేటస్ రిపోర్టును పరిశీలన చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. తొక్కిస్లాట ఘటనపై బెంగళూరు హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఘటనపై ప్రభుత్వానికి సంబంధించి వివరాలను అడ్వొకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. రెండున్నర లక్షల మంది స్టేడియం వద్ద చేరుకున్నారని.. తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందారని.. 56 మంది గాయాలు, 15 మంది డిశ్చార్జ్ అయ్యారని కోర్టుకు తెలిపారు. భద్రతాపరంగా అన్ని పటిష్టమైన చర్యలు చేపట్టామని ఏజే కోర్టుకు వివరించారు. ఇంతటి భారీ స్థాయి కార్యక్రమాలు జరుగుతుంటే ఎందుకు భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని కానీ ఊహించని విధంగా ఘటన జరిగిందని అడ్వొకేట్ జనరల్ తెలిపారు. తొక్కిసలాట జరిగిన సమయంలో అంబులెన్స్ లో ఉన్నాయా? అని సీజే ప్రశ్నించారు. స్టేడియం వెలుపలే అంబులెన్స్‌లు ఉన్నాయని.. అయితే లెక్కకు మించి గాయపడిన వారు ఉండటంతోనే కాస్త సమస్య వచ్చిందని ఏజే సమాధానమిచ్చారు. మెజిస్టేరియల్ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని... 15 రోజుల్లోనే ఘటనపై నివేదికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. స్టేడియంలోని 21 గేట్లు- తెరిచారా? అని కోర్టు ప్రశ్నించింది. మొత్తం గేట్లు- తెరిచామని అసలు ఎందుకు తొక్కిసలాట జరిగిందో విచారిస్తున్నామని అడ్వొకేట్ జనరల్ పేర్కొన్నారు.... ఇప్పటికే నిర్వాహకులకు నోటీ-సులు జారీ చేశామని స్పష్టం చేశారు. ప్రతి విచారణను పూర్తిస్థాయిలో వీడియో రికార్డింగ్ చేసి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. ఈ సందర్భంగా కోర్టులోని న్యాయవాది అడ్వొకేట్ జనరల్‌కు నాలుగు సూటి ప్రశ్నలు వేశారు. జరిగిన ఘటనలోని వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారని... నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరారు. క్రికెటర్లకు సన్మానం చేయాలని నిర్ణయించింది ఎవరు? ఆర్సీబీ నా లేక కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ నా... లేక రాష్ట్ర ప్రభుత్వామా...? రాష్ట్రం కోసం ఆడిన ఆటగాళ్లను సన్మానించడానికి రాష్ట్రానికి ఉన్న అర్హత ఏంటి? ఎందుకు అలా చేయాలని అనుకున్నారు? విధాన సౌధ, చిన్న స్వామి స్టేడియంలో రెండు చోట్ల కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అవసరమేంటి? రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భద్రతా పరమైన చర్యలు ఏంటి? ఈ ప్రశ్నలకు అడ్వకేట్ జనరల్ సమాధానాలు చెప్పాలని లాయర్ కోరారు. విచారణ అనంతరం వెల్లడిస్తామని సమాధానం చెప్పారు.

# రాజన్న కోడెలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

## - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలోనీ కోడెలకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వాటికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. తిప్పాపూర్ లోని గోశాలను గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాల ఆవరణలో పారిశుధ్య పనులు నిర్వహించుటకు అదనముగా వర్కర్లను నియమించుటకు ఉద్యోగ ప్రకటన జారీ చేశామని, కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకోవాలని, పక్కా ప్రణాళిక ప్రకారం అన్ని పనులు చేయించాలని పేర్కొన్నారు. కోడెలకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.గోశాలలో నిర్వహిస్తున్న షెడ్ల నిర్మాణ పనులను స్వయంగా తిరిగి పరిశీలించి గోశాల ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రం ఉంచాలని, కోడెలకు మెరుగైన దాణా, పచ్చి గడ్డి, తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి, పశు వైద్యులు, విశ్వహిందు పరిషత్ సభ్యులు రాధాకిషన్ రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప ఆలయంలో మాస పూజ, అన్నదానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో గురువారము అర్చకులు గణేష్ అయ్యప్ప స్వామి నక్షత్ర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాత మునిపల్లి వాస్తవ్యులు బత్తుల లయ, నరేష్ సుదర్శన్ ట్రేడర్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిహెచ్ కిషన్, టి గంగాధర్, అంబటి నవీన్, రమేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తర దక్షిణ ద్వార నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని ప్రాచీన ప్రసిద్ధ శ్రీ నిమిషా%శీ%భ ఆలయం ఉంది. ఆలయంలో ఉత్తర ద్వార దర్శన సింహద్వారం ఏర్పాటు కోసం భక్తులు విరాళాలు అందజేయాలని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొన్నది. నిమిశంభ దేవి టెంపుల్ డెవలప్‌మెంట్ సొసైటీ "అకౌంట్ నెం 07371001110962 ఐఎఫ్ఎస్సి కోడ్ నం. %ఖదీ× చీ0 807371% బ్రాంచ్ బాల్కొండ, జిల్లా నిజామాబాద్.



# విత్తనాలు, ఎరువుల, స్టాక్ రిజిస్టర్ లలో తేడా

## శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ అమ్మకాల నిలిపివేతకు కలెక్టర్ నోటీసులు జారీ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జిల్లాలో ఎరువులు, విత్తనాలు నిబంధనలు ప్రకారం విక్రయించాలని సంబంధిత అధికారులను, విక్రయదారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం వేములవాడ పట్టణంలోని హనుమాన్ ఎంటర్ప్రైజెస్ విత్తనాలు, శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ ఎరువులు, విత్తనాలు విక్రయ దుకాణాలను, గోదాములను ఆకస్మికంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. పట్టణంలోనే దుకాణాల్లో విత్తనాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ ఎరువులు దుకాణం లోని సేల్స్ రిజిస్టర్ మరియు స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదాం ను తనిఖీ చేయగా రిజిస్టర్ల ప్రకారం గోదాములో ఎరువులు లేనట్లు గమనించి సదరు దుకాణంలో అమ్మకాల నిలిపివేతకు నోటీసులు జారీ చేయవలసిందిగా తెలిపారు. సదరు నోటీసులకు సరైన సంజాయిషీ సమర్పించని యెడల ఈ షాపును సీజ్ చేయవలసిందిగా వ్యవసాయ అధికారిని ఆదేశించారు.నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని విక్రయ యజమానులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# భూభారతి చట్టంతో భూ సమస్యల శాశ్వత పరిష్కారం

## - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని, భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ .తెలిపారు. గురువారం కలెక్టర్ వేములవాడ రూరల్ మండలం హనుమాజీ పేట లో రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. భూ హక్కుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం వినియోగించుకొని జూన్ 3 నుంచి జూన్ 20 వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రర్లను, రైతుల భూసమస్యల దరఖాస్తులను పరిశీలించారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ నెంబర్ భూమికి సంబంధించిన అన్ని వివరాలతో అందించడం జరుగుతుందని అన్నారు. సాదా బైనమా దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రస్తుతం భూమి ఎవరి కబ్జాలో ఉంటే పంచనామా నిర్వహించి స్థానికంగా విచారణ చేసి వారికి పట్టాలు అందించేందుకు చర్యలు చేపట్టి భూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. భూముల మ్యూటేషన్ సమయంలో కుటుంబ సభ్యులందరికీ తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, 30 రోజుల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చట్టంలో మార్పులు తీసుకొని వచ్చామని అన్నారు. భూ యాజమాన్య వివాదాలను గతంలో సివిల్ కోర్టులో మాత్రమే పరిష్కారం ఉండేదని, ప్రభుత్వం తహసిల్దార్ నుంచి సిసిఎల్ఏ వరకు రెవెన్యూ కోర్టులను మళ్లీ ప్రవేశ పెట్టిందని అన్నారు. ఈ



కార్యక్రమంలో తహసిల్దార్ అబుబాకర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కోడెల కోసం ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలి

## : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ శ్రీ రాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలోని కోడెలను పొందుట కోసం రైతులు, ప్రజలు ఆన్లైన్లో జిల్లా వెబ్సైట్ %ష్ట్రజూం://తీఱయిఱఅఱంఱతీఎఅశ్రీ-శ్రీఝ.వశ్రీఱఅస్త్రుఱఖ.స్త్రశీఙ.ఱఅ%/ నమోదు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన ప్రజలు, రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ %ష్ట్రజూం://తీఱయిఱఅఱంఱతీఎఅశ్రీశ్రీఝ.వశ్రీఱఅస్త్రుఱఖ.స్త్రశీఙ.ఱఅ%/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో కోడెలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.



# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

**సమయజ్యోతి ప్రతినిధి హన్మకొండ**

సైకిల్ వాకర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా 303, ఆద్వర్యం లో జంగ. గోపాల్ రెడ్డి అధ్యక్షతన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పబ్లిక్ గార్డెన్ హన్మకొండలో ప్లాస్టిక్స్ ల నిషేధంపై, శబ్ద, వాయు, జల కాలుష్యాలపై ప్లకార్డులతో అవగాహన కల్పించడమైనది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిస్తూ, కాలుష్యాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు ప్రతి రోజూ దగ్గరి దూరాల ప్రయాణాన్ని సైకిలుపై కొనసాగించాలని సూచించారు.కార్యక్రమానికి హాజరైన విశ్రాంత ప్రొఫెసర్ దామోదర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విదేశాలలో సైకిళ్ల వినియోగాన్ని కొనియాడుతూ స్వదేశీయులమైన మనం సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచిస్తూ సైకిల్ వాకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారుకార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి. అనంత్, సభ్యులు రమేష్, నర్సయ్య,లక్ష్మయ్య రవి,జయప్రసాద్ శ్రీనివాస రెడ్డి, అలీ, వేణుగోపాల్, యోగా సభ్యులు సుకన్య,రోహిణి,లత,అనురాధ,అమరావతి, శోభారాని,రజని,అఖిల,రాంచెంద్రారెడ్డి, చంద్రమౌళి, ఓరుగళ్ళు వాకర్స్ అధ్యక్షుడు శ్రీదర్, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హత గల వారికే ఇండ్ల మంజూరు.. కలెక్టర్ కు లబ్ధిదారుల కృతజ్ఞతలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు మూడు నెలల్లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన సిరిసిల్ల నియోజకవర్గంలోని ఆయా మండలాల లబ్ధిదారులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపేందుకు విచ్చేయగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో వారితో సమావేశం నిర్వహించారు. పేదలు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు. మంజూరు పత్రాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. సిమెంట్, స్టీల్ ధరలు తగ్గించేలా ఏర్పాట్లు చేస్తుందని వివరించారు. నిర్మాణానికి డబ్బులు లేని మహిళా సంఘాల సభ్యులకు గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా పట్టణాల్లో మెప్మా ద్వారా రూ. లక్ష రుణం అందిస్తామని తెలిపారు. త్వరితగతిన ఇండ్లు మొదలు పెట్టాలని సూచించారు. బేస్మెంట్, ఇతర దశలు పూర్తి కాగానే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డ్ ఆఫీసర్ల తో



ఫోటో తీయించి, అప్లోడ్ చేయించాలని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. దీనికి ఎవరి పైరవీ అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. తమకు ఇండ్లు మంజూరు చేయించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు లబ్ధిదారులు కృత్షతలు తెలిపారు. కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లు, మహిళలు పాల్గొన్నారు.

సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# పర్యావరణ విధ్వంసం ఆగేదెప్పుడు?

ఏటా జూన్ 5న పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా....ప్రయోజనాలు, విధ్వంసాల గురించి చర్చించుకుంటున్నా మార్పు మాత్రం కానరావడం లేదు. ఈ భూమి ఏమైతే మనకేంటి అన్న ధోరణిలో పాలకులు, ప్రజలు ఉన్నారు. ప్రకృతికి మనిషే ప్రథమ శత్రువుగా మారాడు. అదే మనలను విధ్వంసం చేస్తోంది. రకరకాల జబ్బులకు కారణమవుతోంది. అయినా మనలను మనం సంస్కరించుకోలేక పోతున్నాం. దుష్పరిణామాలపై మేల్కోవడం లేదు. సంస్కరించుకుని పయనించలేక పోతున్నాం. ఏటా జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఉపన్యాసాలు ఇవ్వడం,మొక్కలు నాటడంతో పని పూర్తి చేస్తున్నారు. కానీ కార్యాచరణ కానరావడం లేదు. ప్రధానంగా ప్లాస్టిక్ భూతం కలిగిస్తున్న దుష్ఫలితాలపై చర్చించడం లేదు. ప్లాస్టిక్ మన జీవితంలో భగంగా మారింది. దానిని బయటపడేయంతో చేతులు దులుపుకుంటున్నాం. చెట్లను పూర్తిగా నరికేశాం. అసలు అడవులను పూర్తిగా నిర్మూలించాం. కొండలను పిండి చేసి వాటి మనుగడ లేకుండా చేస్తున్నాం. పశువులను కూడా బతకనీయ కుండా మనం ఆహారంగా తీసుకుంటున్నాం. అడవుల నరికివేత వల్ల జంతువులు పూర్తిగా తగ్గిపోయాయి. కొతులు గ్రామాలపై పడి ప్రజలను రక్కుతున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. పంటల కోసం విపరీతంగా రసాయన ఎరువులు వాడేస్తున్నాం. ఇవన్నీ మనకు క్యాన్సర్ లాంటి జబ్బులకు కారణం అవుతున్నాయి. ఇవన్నీ తెలిసీ జరుగుతున్న అతిపెద్ద పొరపాట్లు. అయినా మనకు జ్ఞానోదయం కలగడం లేదు. యూరోప్ దేశాల్లో ప్రకృతి పరిరిక్షణకు ప్రాధాన్యం ఇస్తుంటే మనం మాత్రం విధ్వంసం సృష్టిస్తున్నాం. నదులను, చెరువులును మింగేస్తున్నాం. భారీ వర్షాలుకురిసినప్పుడు ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోయాక కానీ మనకు తెలిసి రావడం లేదు. గతేడాది బుడమేరు, ఖమ్మం ఘటనలు ఇంకా మన కళ్లముందే కదలాడుతున్నాయి. ఏటా భారీ వర్షాలు కురిసినా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు కాక తప్పడంలేదు. ఉత్తరాదిలో ముఖ్యంగా అసోం తదితరరాష్ట్రాల్లో అప్పుడే వరదలు మొదలయ్యాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారు. వరదనీరు సముద్రం పాలు కాకుండా నీటిని ఒడిసి పట్టి తరవాతి కాలంలో ఉపయోగించే ప్రణాళికలు ఇంకా రూపుదిద్దుకోవడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా ఆలోచనలు చేయక పోవడంతో ఏటా వరదల్లో ప్రజలు మునిగిపోతున్నారు. నదులు ఉప్పొంగినప్పుడు వేలాదిగ్రామాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. ఏటా కృష్ణా,గోదావరి జలాలు సముద్రం పాలు కాక తప్పడంలేదు. వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోలేదు. ఎపి, తెలంగాణలో పలుప్రాంతాలతో పాటు ఉత్తరాదిలో వరదలు ముంచెత్తడం ఆనవాయితీగా మారింది. బీహార్,గుజరాత్,అసోం ,కేరళ తదితర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు, పట్టణాలు వరదనీటిలో మునిగి పోతున్నా మేల్కోవడం లేదు. వరదలు వస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రకృతి విధ్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కానవస్తున్నాయి. వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. భారీ వర్షాలు, వరదల వలన కలిగే నష్టాలు విషాదకరం. నదీ ప్రవాహాలను సమర్థవంతంగా నియంత్రించి నీటిని ఒడిసిపట్టే బదులు పర్యావరణ నిబంధనలను ప్రభుత్వమే ఉల్లంఘించి వరదనీటి ప్రవాహాలు అదుపు తప్పేందుకు కారణభూతమవుతోంది. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. పర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రానురాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడీతో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావరణవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. గనుల,క్వారీల తవ్వకాలు,అడవుల విధ్వంసం, పట్టణీకరణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. గతేడాది నాటి కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జలవిపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖండ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తినప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంకపర్చి చుట్టుపక్కనున్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ నేటికీ ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలూ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాలు చర్చకొస్తాయి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టాలు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్,బీహార్‌లు జలదిగ్బంధంలో చిక్కుకుంటు న్నాయి. అత్యధిక వర్షపాతం నమోదయినా నీటి సంరక్షణపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పాటు, అమలు చేయాలన్న లక్ష్యం కానరావడం లేదు. ఇటీవల ఆర్థిక నగరం ముంబయి ముంపునకు గురైంది. ఇవన్నీ పర్యావరణ విధ్వంసానికి కారణంగా చూడాలి. వీటిని నిరోధించేలా మన కార్యాచరణ ఉంటే తప్ప భవిష్యత్ ఉత్పాతాలను తట్టుకోలేమని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

# సినిమాకు కావ్య స్థానం కల్పించిన దర్శకులు.

## (నేడు ప్రత్యాగాత్మ వర్ధంతి)



కె.ప్రత్యగాత్మగా ప్రసిద్ధిచెందిన కొల్లి ప్రత్యగాత్మ తెలుగు సినిమా దర్శకుడు. చదువుకునే రోజుల్లోనే చేసిన జాతీయవాద ప్రదర్శనలకు గాను జె.జె.కళాశాల యొక్క బ్రిటీషు ప్రిన్సిపాలు ప్రత్యగాత్మను కళాశాల నుండి బహిష్కరించారు . జర్నలిస్ట్‌గా వ్యవహరించి, సినీరంగంలోకి ప్రవేశించి, కథా రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి, దర్శకుడై, తరువాత చిత్ర నిర్మాతగానూ కొనసాగారు కె. ప్రత్యగాత్మ. హిందీ చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ, నిర్మాతగానూ వ్యవహరించిన ఈయన బాలీవుడ్‌లో కె.పి. ఆత్మగా సుపరిచితులు. కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని ముదునూరులో 1924వ సంవత్సరంలో కొల్లి కోటయ్య వర్మ, అన్నపూర్ణ దంపతులకు జన్మించిన ప్రత్యగాత్మ తొలుత కమ్యూనిస్ట్ ఉద్యమంలో పాలుపంచుకున్నారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఉన్న కారణంగా కొంతకాలం అండర్ గ్రౌండ్‌లోనూ ఉన్నారు. ఈయన భార్య అన్నపూర్ణ కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. తరువాత ఉద్యమంలో వచ్చిన మార్పుల కారణంగా ఉపాధి ఎంచుకునే దశలో జర్నలిస్ట్‌గా కెరీర్ ఎంపిక చేసుకుని 'జ్వాల' పత్రికను ఏప్రిల్ 1952లో ప్రారంభించి కొంతకాలం నిర్వహించారు. ఉదయని పత్రికకు కూడా వ్యాసాలు రాసేవారు.మద్రాసు చేరి, తాతినేని ప్రకాశరావు వద్ద కథా రచయితగా, సహాయ దర్శకుడుగా పనిచేసారు. 1954లో తొలిసారి సమకూర్చిన కథ నిరుపేదలు చిత్రానికి. ఆ తరువాత జయం మనదే, ఇల్లరికం, చిత్రాలకు కథ సమకూర్చారు. పి.ఎ.పి వారు నిర్మించిన ఇల్లరికం చిత్రానికి సెకండ్ యూనిట్ డైరెక్టర్‌గా 1959లో వ్యవహరించారు. కృష్ణకుమారి, అక్కినేని ప్రధానపాత్రలు పోషించిన భార్యాభర్తలు చిత్రంతో 1961లో దర్శకుడుగా మారారు. ఇది ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ పతాకాన నిర్మితమయింది. ఎ.వి.సుబ్బారావు ఈ చిత్ర నిర్మాత. తొలి చిత్రం ఘనవిజయం సాధించడంతో ఆ తరువాత అక్కినేని హీరోగా పలు చిత్రాలను రూపొందించారు ప్రత్యగాత్మ. భార్యాభర్తలు చిత్రంలో పాటలు కూడా హిట్. ఈ చిత్రానికి గాను కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రపతి చేతులమీదుగా రజిత కమలం దక్కింది

చక్కని కుటుంబ కథకు, సెంటిమెంట్లు జోడించడం, మంచి డ్రామా పండించగల నేర్పు, హిట్ అయ్యే పాటలను ఎంపిక చేయడం అనేవి ప్రత్యగాత్మలోని ప్రత్యేకతలు. సహజంగా ఉన్న ఊహాశక్తి, తాతినేని ప్రకాశరావు వద్ద చేరడంతో మరింత మెరుగులు దిద్దుకుంది. 1966లో సొంత సినీ నిర్మాణ సంస్థ ఆత్మ ఆర్ట్స్ ప్రారంభించారు . కులగోత్రాలు, పునర్జన్మ, మనుషులు మమతలు, ఆదర్శకుటుంబం, శ్రీమంతుడు, పల్లెటూరి బావ అక్కినేని హీరోగా ప్రత్యగాత్మ దర్శకత్వంలో రూపొంది విజయం సాధించాయి. అమ్మకోసం, ముగ్గురు అమ్మాయిలు, మా వదిన, అత్తవారిల్లు, అల్లుడొచ్చాడు, గడుసు అమ్మాయి, కన్నవారి ఇల్లు, కమలమ్మ కమతం తదితర చిత్రాలు ప్రత్యగాత్మ రూపొందించినవే. 1980లో దర్శకత్వం వహించిన నాయకుడు - వినాయకుడు ఈయన చివరి చిత్రం. ఈయన 1962లో భార్యాభర్తలు చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రముగా రజత కమలాన్ని అందుకున్నాడు.చక్కని చిత్రాలు డైరెక్ట్ చేసిన కె. హేమాంబరధరరావు ఈయన సోదరుడే. హాస్య చిత్రాల దర్శకుడు కె.వాసు, ప్రత్యగాత్మ పెద్దకుమారుడు.చిత్ర పరిశ్రమల్లో వచ్చిన మార్పులు జీర్ణించుకోలేకనో, ఆరోగ్యం సహకరించకనో 1980 తర్వాత నుంచి దర్శకత్వంకు దూరమై జూన్ 6, 2001 వ సంవత్సరంలో హైదరాబాదులో స్వర్గస్తులయ్యారు.

డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్
9490833108.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ



**రాయ్‌పూర్,జూన్5(సమయజ్యోతి):** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు టెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ గౌతమ్ ఉన్నారు. ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు కీలక మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలో విస్తరించిన నేషనల్ పార్క్‌లో కాల్పులు కొనసాగుతున్నాయి. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భారీగా మావోయిస్టులు ఉన్నట్లు- భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి.ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం ఆయన స్వగ్రామం. కాగా, ఈ ఘటనలో పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీజాపుర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు- లక్ష్మీ నరసింహాచలం మృతిచెందాడు. అతడు సుధాకర్‌గా పార్టీలో ప్రసిద్ధి చెందాడు. అతడికి గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ రామరాజు, సోమన్న అనే మారు పేర్లు ఉన్నాయి. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం. గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్‌పై రూ. కోటి రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఇంద్రావతి - టైగర్ రిజర్వ్‌లో మావోయిస్టు సీనియర్ నేతలు ఉన్నట్లు భద్రతా దళాలకు పక్కా సమాచారం అందడంతో.. డీఆర్జీ, ఎస్‌టీ-ఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి తనిఖీలు మొదలుపెట్టాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున దళాలు- మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ నేలకొరిగినట్టు సమాచారం. బీజాపుర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. అయితే సుధాకర్ మృతికి సంబంధించి ఎటువంటి ప్రకటను ఆయన జారీ చేయలేదు. బీజాపుర్ అడవుల్లో సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆరునెలల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ-కి చెందిన ముగ్గురు నాయకులను దళాలు ఎన్‌కౌంటర్ చేయడం గమనార్హం. ఇక తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ- సీనియర్ లీడర్ పాపారావు కూడా అక్కడే ఉన్నట్లు తమకు సమాచారం అందినట్లు- బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ప్రకటన జారీ చేశారు. ప్రకాశ్ మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లో కార్యకలాపాలను పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్ర నిపుణుడు. ఉచ్చులు పన్నడంలో దిట్టగా పేరుంది. చాలా ఐఈడీ ఇతర దాడుల్లో అతడు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నాడు. అతడిపై రూ.20లక్షల రివార్డు ఉంది. వీరిద్దరికి సంబంధించిన సమాచారం వెల్లడి కాలేదు. కేవలం మూడు వారాల వ్యవధిలో అగ్రనేతలను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా చత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోలు లొంగిపోయారు. మరోవైపు ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత సింహాచలం మృతి
- నెలలోపే నంబాల తరవాత మరో అగ్రనేత హతం
- సింహాచలంపై కోటి రివార్డు ఉన్నట్లు పోలీసుల ప్రకటన

# మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ఆర్మూర్ పట్టణంలో గురువారము జరిగిన వందరోజుల కార్యాచరణ సమావేశం లో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని. మన అందరి బాధ్యతగా భావి తరాలకు పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందించాలని సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుండి సెప్టెంబర్10 వరకు మున్సిపల్ పరిధి లోని అన్ని వార్డుల్లో శుభ్రంగా ఉంచుతు ఇబ్బంది ఉన్న ప్రాంతాలలో అభివృద్ధి చేయడం లక్ష్యం గా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సాయి బాబా గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ పండిత్ పవన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మున్ను భాయ్, నాయకులు కౌన్సిలర్ రహమాన్, నర్సయ్య, మురళి, ఇంథాజ్, ఫయాజ్, మజిత్ భాయ్, మారుతి రెడ్డి, గిరి, రవికాంత్ రెడ్డి, అజ్జు భాయ్, జిమ్మీ రవి, ఫాయిామ్ భాయ్, భుపేందర్ పాల్గొన్నారు.



# యోగి రామన్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారముతో రెండో రోజున వేద పండితులు మిరియాల్కర్ త్రినేత్రం, రాజు నేతృత్వంలో నూతన యోగి రామన్న ఆలయ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. మంటపదేవతా పూజ, మూలమంత్రజపం, హోమం, విగ్రహమూర్తుల ధాన్యాదివాసం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, హోమం, పలాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, పవళింపుసేవ జరిపారు. ఈ సందర్భంగా మాదిగ సామాజిక వర్గము నాయకులు భక్తులు పాల్గొన్నారు.



# జిల్లా విద్యార్థిని జోహా సదాఫ్ కు సియాసత్ ఎక్సలెంట్ అవార్డు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన టాపర్లను ప్రోత్సహించడానికి సియాసత్ డైలీ,సియాసత్ ఎక్సలెంట్ అవార్డు మరియు నగదు బహుమతుల పంపిణీని ప్రకటించింది.ఈ అవార్డుల పంపిణీ హైదరాబాద్‌లో జరిగింది.ఇందులో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కె.ఆర్.కె. కాలనీ విద్యార్థిని జోహా సదాఫ్ తండ్రి అబ్దుల్ రషీద్‌కు సియాసత్ ఎక్సలెంట్ అవార్డు లభించింది.మహెబూబ్ హుస్సేన్ జిగర్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో దినపత్రిక సియాసత్ న్యూస్ ఎడిటర్ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్,ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని జోహా సదాఫ్ కు పిసి ఉర్దూ మీడియం ద్వారా సియాసత్ ఎక్సలెంట్ అవార్డు,ఖురాన్ షరీఫ్ పుస్తకం,సర్టిఫికెట్,పతకం మరియు నగదు బహుమతిని ప్రధానం చేశారు.99 శాతం మార్కులతో విశిష్ట విజయాన్ని సాధించినందుకు జోహా సదాఫ్‌ను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా కూడా సత్కరించారు.విద్యా నైపుణ్యం తో సియాసత్ ఎక్సలెంట్ అవార్డు అందుకున్న జోహా సదాఫ్ కు తల్లిదండ్రులు,బంధువులు, ఉపాధ్యాయులు మరియు స్నేహితులు ఆమెను అభినందించారు.ఆమె భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు



# ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో రిమ్స్ డైరెక్టర్ కు సన్మానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్

రిమ్స్ మెడికల్ కాలేజీ డైరెక్టర్ డా జై సింగ్ రాథోడ్ కు తన జన్మదినం పురస్కరించుకొని ఐ ఎన్ టి యు సి రిమ్స్ ఆదిలాబాద్ కార్యవర్గం ఘనంగ సన్మానం చేసీ పూల గుచ్చము అందచేశారు, ఈ సందర్భంలో రిమ్స్ విభాగ అధ్యక్షుడు గోపు మహేంద్ర మాట్లాడుతూ రిమ్స్ మెడికల్ కాలేజీ ఆభివృద్ధికి , జెనరల్ హాస్పిటల్ అభివృద్ధి చేయడం కోరకు అందరినీ సమన్వయం చేస్తూ నిరంతర శ్రామికుడు డైరెక్టర్ అని అన్నారు, ఈ కార్యక్రమంలో సిరిగిరి విశ్వనాథ్, నైతం సంతోష్, మురారీ శ్రీనివాస్, అఖిల్, ప్రకాష్, తమ్ముడి రాకేష్ పాల్గొన్నారు



# ఐఐటి ర్యాంకర్ కు ఆర్ టి డబ్ల్యూ ఏ ఆత్మీయ సన్మానం

సమయజ్యోతి ప్రతినిధి హన్మకొండ

హనుమకొండ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు సుంకర ఉమ తిరుపతిరెడ్డి ల కుమారుడు సాయి రిశాంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన ఐఐటి (జీ) అడ్వాన్స్ ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో 32 వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా రెడ్డి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘన విజయం సాధించిన విద్యార్థిని సన్మానించారు. అత్యంత కఠినమైన పోటీ పరీక్షలలో నెగ్గిన సాయి రిశాంత్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయి రిశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తాను బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలనుకుంటున్నానని, భవిష్యత్తులో మరింతగా రాణించి సేవా రంగంలో స్థిరపడాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన విద్యార్థి తల్లిదండ్రులు ఉమా తిరుపతి రెడ్డిలు మాట్లాడుతూ.. ఆధునిక చదువులు అత్యంత ఒత్తిడితో కూడినది అయినప్పటికీ పిల్లలు సాధిస్తున్న విజయాలను చూసి గర్వంగా ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారా పిల్లలు దేనినైనా సాధించవచ్చు అనే విశ్వాసంతో తాము పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శక్తి వంచన లేకుండా బోధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ టి డబ్ల్యూ ఏ సభ్యురాలు పద్మ మాట్లాడుతూ.. కఠిన తరమైన పోటీ పరీక్షలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి ఉన్నత ర్యాంక్ సాధించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ టి డబ్ల్యూ ఏ కోశాధికారి రమణారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి మరియు సభ్యులు జైపాల్ రెడ్డి తిరుపతిరెడ్డి రాజేందర్ రెడ్డి గోపాల్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి వైవి రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.సాయి రిషాంత్ రెడ్డి రెడ్డి జాతికి గర్వ కారణం గా నిలిచారని తెలంగాణ రెడ్డి బిడ్డ పత్రిక ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రతినిధి కామిడి సతీష్ రెడ్డి ఫోన్ ద్వారా అభినందించారు



# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్లను నాటిన మున్సిపల్ కమిషనర్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం సందర్భంగా మూడో వార్డులోని వైకుంఠ దామంలో మందమర్రి మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు మాట్లాడుతూ మన భూమి నేడు తీవ్రమైన పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటుంది, గాలి కాలుష్యం, అటవీ నాశనం, వాతావరణ మార్పులు, ఇవన్నీ మానవాళి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయని అన్నారు. ఇందులో నుండి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ రక్షణకు కట్టుబడిగా ఉంటూ చెట్లను నాటాలని, నీటి వనరులు పొదుపుగా వినియోగించు కోవాలని, అలాగే ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించాలని అన్నారు. ప్రకృతిని పరిరక్షించడం అంటే మన జీవితాన్ని పరిరక్షించడం, పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత మాత్రమే కాదు భవిష్యత్ తరాలకు మనం అందించే బహుమతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి కృష్ణ ప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ వి శ్యాంసుందర్, సీనియర్ అసిస్టెంట్లు డి లక్ష్మీ రాజు, ఏ రాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు ఏన్ రాజకుమార్, ఇ వసంత్, హెల్త్ అసిస్టెంట్ ఎంఎ సమీర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం గోపికృష్ణ, ఏ రఘురాం, బి శ్యాంబాబు, ఇ కుమార్, మెప్మా సిబ్బంది, తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు శ్రీనివాస్, వీరేశం, ఎమ్మెల్సీ కోదండరాం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో గురువారము సిపిఐ జిల్లా నేత గుంటి వేణు కుమారుడు అభిలాష్ శివాని వివాహ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ కోదండరాం, చాడ వెంకటరెడ్డి, చలపతిరావు, అమర్, విమలక్క హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు సొంతింటి కల సకారం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక సొంత ఇల్లు. ఈ చిరకాల స్వప్నం సాకారం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం పట్ల లబ్ధిదారులు వర్షం వ్యక్తం చేస్తున్నారని గురువారం బాల్కొండ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంతోషాన్ని వెలిబుచ్చారు. ప్రజా ప్రభుత్వం సహకారంతో అడుగులు వేగంగా పడుతున్నాయని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయని, లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందిస్తోందని, ప్రభుత్వం మొదటి దఫాలో ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం, పేదలకు గూడు భరోసా వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ టి అరవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, మండల మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ జావీద్, మొహమ్మద్ యునుస్, సయ్యద్ రియాజ్ అలీ, గోపు ఉషన్న, సయ్యద్ రియాజుద్దీన్, షేక్ షేరు, తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన ఎంపీ జీ. నగేష్

సమయజ్యోతి న్యూస్ జూన్ 5 బజార్ హత్నూర్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ గురు వారం నాడు బజార్ హత్నూర్ మండలంలోని తన సొంత గ్రామమైన జాతర్ల లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూల మొక్కలు నాటారువారితో బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మాజీ జెడ్పిటిసి తాటిపల్లి రాజు, సహకార సంఘం చైర్మన్ వెంకన్న, అల్కే గణేష్, సూది నందు, అడ్వకేట్ రాములు, సూది వినాయక్ చంద్రకాంత్ వెంకటస్వామి మాజీ సర్పంచ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ధరణి పోర్టల్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.- ఎమ్మెల్యే పాయల్ శంకర్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే సందర్శించారు.ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.పలువురు రైతులతో ఆయన మాట్లాడారు.రెవెన్యూ సదస్సులకు వచ్చే రైతులకు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులు మహేష్,నాయకులు దయాకర్,వెంకన్న,ముకుంద,మల్లేష్ తదితరులు ఉన్నారు.




# కలకలం లేపిన వృద్ధుడి కిడ్నాప్ ఘటన... చేదించిన పోలీసులు ముగ్గురికి రిమాండ్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పోలీసులు, కలకలం లేపిన ఒక వృద్ధుడి కిడ్నాప్ ఘటనను శీఘ్రగతిన దర్యాప్తు చేసి, చాకచక్యంగా వ్యవహరించి, ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరి సహాయక నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఎస్సై చిందం గణేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 2న కిడ్నాప్ కు గురై, కోరుట్లలో గృహ నిర్బంధంలో ఉన్న గూడూరు గ్రామానికి చెందిన జంపల్లి మల్లయ్య (72)ను, పోలీసులు సురక్షితంగా ఇంటికి చేర్చారు. ఇదిలా ఉండగా మల్లయ్య కొడుకు పరశురాములు తీసుకున్న అప్పు 30 లక్షలు చెల్లించడం లేదని, పరశురాములు తండ్రిని బంధిగా ఉంచుకొని, అప్పు మొత్తాన్ని రాబట్టాలనే దుర్లక్ష్యంతో కిడ్నాప్ దుస్సహాసానికి పాల్పడినట్లుగా ప్రధాన నిందితుడు మల్కపేట బోయిని రాజేందర్, పోలీసుల విచారణలో అంగీకరించాడు. కిడ్నాప్ ఘటనకు నిందితుడి స్నేహితులు కలకోట రవి, సందడికారి సతీష్ సహకరించగా, వారిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. కిడ్నాప్ కు వినియోగించిన కార్ డ్రైవరు పరారీలో ఉన్నాడు.



# జిల్లాలో భూ భారతి రెవెన్యు సదస్సులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## విత్తన షాపులు,ఎరువుల గోదాం లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లీ (బి),లాండ సాంగ్వి,మావల మండలంలోని సరస్వతి నగర్,చాంద(టి),తంతోలి లలో రెవెన్యు సదస్సులు,విత్తన షాపులను గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆదిలాబాద్ రూరల్ అర్లి (బి) గ్రామ పంచాయితీ లో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి,గ్రామస్తులు దరఖాస్తులు ఏ సమస్య పై పెట్టుకున్నారు.ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేస్తున్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.వివిధ రెవెన్యూ గ్రామాలలో జరుగుతున్న సదస్సులను పరిశీలించి,మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి,భూ సమస్యలు పరిష్కారానికి రైతులకు సులభతరమైన విస్తృత సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సదస్సులను జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ,ఈ సదస్సులో సమస్యలు ఉన్న రైతులు,ప్రజలు వినియోగించుకోవాలనీ సూచించారు.ధరఖాస్తు కోసం వచ్చే వారికి కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు సమకూర్చాలని,హెల్ప్ డెస్క్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు.రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం మావల మండలం సరస్వతి నగర్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన రెవెన్యు సదస్సులు,ఆదిలాబాద్ గ్రామీణ తంతోలి లలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యు సదస్సులను సందర్శించి అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు.అర్లి (బి) లక్ష్మి ప్రసన్న ఫర్టిలైజర్ షాప్,బెల్లూరి శ్రీ బాలాజీ ఫెర్టిలైజర్స్ సీడ్స్ షాపు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఉన్న ఎరువులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విత్తనాలు,ఎరువులు,రైతులకు విక్రయిస్తున్న



తీరును,రిజిస్టర్ నిర్వహణ పరిశీలించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందనీ,మోసపూరితంగా విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,కేసులు పెట్టడం జరుగుతున్నదని స్పష్టం చేశారు.విత్తనాల సరఫరా,నాణ్యత,నియంత్రణ కోసం ప్రమాణాలు,ధరల పట్టికలు పరిశీలించారు.కలెక్టర్ పర్యటనలో తహిసిల్దార్ గోవింద్,మండల వ్యవసాయ అధికారి తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది నిజామాబాద్ బ్యూరో**

రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేదికలుగా నిలువాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. రుద్రూర్ మండలం రాణంపల్లి, సాలూర మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు రాయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్ లను, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు హితవు పలికారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ



రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఈ ఏడాది నుండే తరగతుల నిర్వహణ

## రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

ఆయా జిల్లాలకు కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రస్తుత (2025-2026) విద్యా సంవత్సరం నుండే తరగతులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా సూచించారు. పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నర్సింహారెడ్డితో కలిసి గురువారం ఆమె ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ, జవహర్ నవోదయ విద్యాలయాలకు శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణాల కోసం అనుకూలమైన స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్లకు సూచించారు. ఇప్పటికే స్థల నిర్ధారణ పూర్తయిన జిల్లాలలో నవోదయ విద్యాలయాల భవన నిర్మాణాలకు చొరవ చూపాలన్నారు. శాశ్వత భవనాలు సమకూరే వరకు అందుబాటులో ఉన్న తాత్కాలిక భవనాల్లో ఈ విద్యా సంవత్సరం నుండే తరగతులు నిర్వహించాలని సూచించారు. తరగతి గదులు, నీటి వసతి, టాయిలెట్స్ వంటి కనీస సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. చిన్నచిన్న మరమ్మతులు, ఫర్నీచర్ వంటి వాటి కోసం ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# మొక్కలను పెంచి కాలుష్యాన్ని నివారించండి

## కమిషనర్ రవిబాబు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు కృషి చేయాలని అమరచింత పురపాలక కమిషనర్ రవిబాబు పిలుపునిచ్చారు. గురువారం అమరచింత మున్సిపాలిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పురపాలక కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వెంబడి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వాతావరణం లోని పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కు దూరంగా ఉండి కాలుష్యాన్ని నివారించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక మేనేజర్ యూసుఫ్, వాడు ఆఫీసర్లు మునిస్వామి, గోపాల్, లక్ష్మయ్య, పురపాలక సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.




# పంట మార్పిడులతో భూసారాన్ని కాపాడుకోవాలి

## కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రజ్ఞులు అనిత

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

రైతులు పంట మార్పిడిలను చేసినట్లయితే భూసారాన్ని కాపాడుకుంటామని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రజ్ఞురాలు డాక్టర్ అనిత తెలిపారు. గురువారం అమరచింత మండల పరిధిలోని నందిమల్ల, మస్తిపూర్ గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ నుండి డాక్టర్ సురేష్, ఆది ప్రసాద్, శాస్త్రజ్ఞులు రాజేందర్ రెడ్డి, అనిత, పశు వైద్య శాఖ డాక్టర్ రమేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ రైతులు ప్రతి సీజన్లో వరి పంట వేయకుండా పంట మార్పిడి చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. వ్యవసాయంతోపాటు పాటి పరిశ్రమ, పశు పోషణ, కోళ్ల పెంపకం చేపట్టినట్లయితే రైతుకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఈమె అన్నారు. అదేవిధంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చెరుకు పంట సాగులో ఉండే లాభాల గురించి రైతులకు వివరించారు. రైతులు ఒకే పంట పై ఆధారపడకుండా నూనె గింజల పంటలను సాగు చేసినట్లయితే రైతులకు అధిక లాభాలు వస్తావని డాక్టర్ ఆది ప్రసాద్ రైతులకు సూచించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శాస్త్రజ్ఞులు మొక్కలను నాటారు. పంట పొలాలలో క్రిమిసంహారక మందుల డబ్బాలను, ప్లాస్టిక్ కవర్లను, ఎరువుల సంచులను పంట పొలాలలో లేకుండా దూరంగా ఉంచాలని, అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరవింద్, మండల విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్రెడ్డికి ప్రభుత్వ విప్ జన్మదిన శుభాకాంక్షలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసును రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో గురువారము మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా, ప్రభుత్వ విప్, అతన్ని శాలువాతో సన్మానించి, స్వీట్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# గ్రామ రెవెన్యూ సదస్సును సందర్శించిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసు గురువారము రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరై, అనంతరం గ్రామ రెవెన్యూ సదస్సును క్షేత్రస్థాయిలో సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంతో, దశాబ్ద కాలంగా పరిష్కరింపబడని, సమస్యలకు పరిష్కారం అందుతుందని పేర్కొన్నారు.



# మున్సిపల్ కమిషనర్ రవిబాబు బదిలీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మున్సిపాలిటీ కమిషనర్ రవిబాబు బదిలీ అయ్యారు, ఈ మేరకు బదిలీ ఉత్తర్వులు గురువారం సాయంత్రం కమిషనర్ కు అందినట్టు తెలిసింది, గత నాలుగు నెలల క్రితం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుంచి వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న రవిబాబు అతి తక్కువ సమయంలోనే బదిలీకావడం చర్చనీయాంశం అయింది.కమిషనర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ముక్కు సూటిగా ఏకపక్షంగా వ్యవహరించడం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం గత రెండు రోజుల క్రితం ఓ ఇంటి నిర్మాణం విషయంలో ఏకంగా ఎమ్మెల్యే పిఏ పైనే బహిరంగంగా విమర్శలు చేయడం తోపాటు పలు అంశాలపై వివాదాస్పదంగా వ్యవహరించారని చెప్పుకుంటున్నారు ఈ వ్యవహారాలతో పట్టణ ప్రజలకు అధికార పార్టీ నాయకులకు కమిషనర్ తీరును తప్పు పట్టినట్లు తెలిసింది. గత నాలుగు నెలల నుంచి అధికార పార్టీ నాయకులకు కమిషనర్ తలనొప్పిగా మారారని చెప్పవచ్చు దీంతో కమిషనర్ గా బదిలీ చేయించారన్న ప్రచారం ఉంది ఏది ఏమైనా అతి తక్కువ సమయంలో కమిషనర్ రవిబాబు ను బదిలీ కావడం తో పట్టణంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు.



# నీతి ఆయోగ్ చర్చల ప్రభావం ఎంత?

## ఏటా మొక్కుబడిగా సమావేశాలు - సిఎంల అభ్యర్థనలపై చర్యలు శూన్యం

**న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):**

ప్రధానమంత్రి మోడీ సమక్షంలో... ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ భేటీలో పలు అంశాలపై చర్చ జరగడం అటుంచితే..పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాలేదు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చక్కగా ఇచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించడం లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో ఏ పార్టీ అధికారం లో ఉన్నా సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగుతున్నాయి. సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగుతున్నాయి. అనేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాభం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ పదకొండేదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్ధతిలోనే సాగుతోంది. నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించారు. ఇక్కడ జరిగే చర్చలకు పెద్దగా ప్రాధాన్యం ఉండడం లేదు. ఇదే విషయాన్ని పలువురు సిఎంలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అంతెందుకు ఒకే పన్ను విధానం అంటూ తీసుకుని వచ్చిన జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవ డానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. నగదు ఉపసంహరణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చకు అవకాశం ఉండడం లేదు. మొత్తంగా పాలకులకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో శ్రద్ధ చూపడం లేదు.రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఎపి విడివడ్డ తరవాత జరిగిన ఆర్థిక విధ్వంసమే ఇందుకు కారణం. అభివృద్ధి పేరుతో చేసిన అప్పులకు నేతలను బాధ్యులుగా చేస్తే మంచిది. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. నేలవిడిచి సాము చేసే విధంగా దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించకుండా దావోస్ లాంటి వేదికలపై పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉప యోగించుకుని యువతను స్వయం సమృద్ధికి సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీసుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అస మనాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదు. ఈ రంగాలకు కేటాయింపులు పెరగడం లేదు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఆహారధాన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంట బట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహార ధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడు తున్నాయి.వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది.

# సామాన్యుల ప్రాణాలకు విలువ లేదా

### సామాన్యుడి ప్రాణం
### చాయ్‌కంటే చౌక
### వ్యాపారవేత్త హర్ష్
### గోయెంకా పోస్ట్‌తో సర్వత్రా చర్చ

**న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):**

మనదేశంలో సామాన్యుల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా ఆందళన వ్యక్తం చేశారు.ఆర్సీబీ విజయోత్సవాల వేళ సంభవించిన తొక్కిసలాట ఘటన పెను విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదానికి కర్ణాటక ప్రభుత్వం వైఫల్యమే కారణమంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. గతంలో జరిగిన పలు తొక్కిసలాట ఘటనలను ప్రస్తావిస్తూ.. సామాన్యుడి ప్రాణాలకు విలువ లేదా అని ఆయన ప్రశ్నించారు. దిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట.. కుంభమేళాలో తొక్కిసలాట.. బెంగళూరులో తొక్కిసలాట.. ఈ ఘటనలో డజన్లకొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కానీ, ఇంతవరకూ ఎవరూ బాధ్యత తీసుకోలేదు. రాజీనామాలు చేయలేదు. పాఠాలు నేర్చుకోలేదు. మన దేశంలో సామాన్యుడి ప్రాణాలు అమూల్యమైనవి కావా? అంత విలువ లేదా? వారి ప్రాణం విలువ కప్ చాయ్ కంటే చౌకగా మారింది. ఇలాంటి ఘటనల తర్వాత అంతా యథావిధిగానే ఉంటోంది. ఏమీ మారట్లేదని గోయెంకా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. హృదయం ముక్కలైన ఎమోజీని జత చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట చర్చకు దారితీసింది. దీనిపై పలువురు నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఇది చాలా దురదృష్టకర ఘటన. నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలి. అయితే, అంతకంటే ముందు సామాన్యులు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కొందరు రాసుకొచ్చారు. సామాన్యుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మరికొందరు అభిప్రాయపడ్డారు. బెంగళూరు తొక్కిసలాటలో మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత బెంగళూరు జట్టు ఐపీఎల్ కప్‌ను సొంతం చేసుకోవడంతో చిన్నస్వామి స్టేడియానికి అభిమానులు పో-టె-త్తారు. అంచనాకు మించి జనం రావడంతో వారిని నియంత్రించడం పోలీసుల వల్ల కాలేదు. అదే సమయంలో వర్షం కురవడంతో తొక్కిసలాట మొదలై పలువురు మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు.

# వియత్నాంలో వేగంగా బైకు నడుపుతూ గోడకు ఢీ

## ప్రమాదంలో ఆసిఫాబాద్ మెడికల్ విద్యార్థి మృతి

## విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ఆదిలాబాద్,జూన్5(సమయజ్యోతి):**

వియత్నాంలోని కాన్ థో నగరంలో జరిగిన ఓ ప్రమాదంలో తెలంగాణకు చెందిన విద్యార్థి మృతిచెందాడు. మృతుడిని కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన అర్షిద్ అశ్రిత్‌గా అక్కడి అధికారులు గుర్తించారు. అర్షిద్ అక్కడ ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో అర్షిద్ నడిపిన బైకు వేగంగా రావడంతో అది అదుపుతప్పి గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాద సమయంలో అతనితోపాటు ఉన్న అతని స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ వేగంగా వెళుతుందని, అదుపుతప్పి నేరుగా గోడను ఢీకొనడంతో ఇద్దరూ పైకి ఎగిరిపడిన దృశ్యాలు దగ్గరలోని సిసిటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఇందుకు సంబంధించి వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. ఈ వీడియోలో మొదట ఓ ప్రశాంతంగా ఉన్న వీధి కనిపిస్తుంది. అలా ఉన్న సమయంలో రోడ్డుపై వేగంగా వచ్చిన ఓ బైకు గోడను చాలా గట్టిగా గుద్దుతుంది. ఢీకొట్టే వేగం ఎంతగా ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. ఎందుకంటే, ఢీ కొట్టిన తర్వాత ఇద్దరూ గాల్లోకి ఎగిరిపోతూ కనిపించారు. ఇకపోతే మృతి చెందిన అర్షిద్ తల్లిదండ్రులు అర్జున్, ప్రతిమలు ఆసిఫాబాద్‌లో బట్టల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వారి కుటుంబంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషాదకర సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు స్పందించారు. మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి మృతదేహాన్ని ఇండియాకు రప్పించే ప్రక్రియ వేగంగా జరగాలంటూ విజ్ఞప్తి చేశారు.

# ఫీజులుకట్టనందుకు ఇంత దాష్టీకమా

## - స్కూళ్లు పెట్టింది కేవలం ఫీజుల కోసమేనా

## -ఢిల్లీలోని ప్రైవేట్ స్కూలుకు హైకోర్టు చివాట్లు

**న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):**

ఫీజులు రాబట్టుకునేందుకు విద్యార్థుల పట్ల దాష్టీకం ప్రదర్శించిన ఓ స్కూల్‌కు ఢిల్లీ హైకోర్టుగా గట్టిగా చివాట్లు పెట్టింది. స్కూళ్లు ఉన్నవి కేవలం ఫీజులు వసూలు చేయడానికే కాదని, విద్యాబుద్ధులు కూడా నేర్పించాలని తెలిపింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరుపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజు వసూలు విషయంలో యాజమాన్యం విద్యార్థుల పట్ల ప్రవర్తించిన తీరుపై అసహనం వ్యక్తం చేసింది. డబ్బు కోసం బహిరంగంగా విద్యార్థులను అవమానించడం సరికాదని పేర్కొంది. ద్వారకాలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం 30మందికి పైగా విద్యార్థుల పట్ల దారుణంగా ప్రవర్తించింది. వారి తల్లిదండ్రులు సమయానికి ఫీజు చెల్లించడంలో విఫలమయ్యారనే కారణంతో బహిరంగంగా వారిని అవమానించింది. విద్యార్థులను స్కూల్ జాబితాలో నుంచి తొలగించింది. వారిని స్కూల్‌కి రాకుండా చేసింది. అందుకోసం సిబ్బందిని కూడా నియమించింది. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. పాఠశాల యజమాన్య చర్యపై అసహనం వ్యక్తం చేసింది. కేవలం డబ్బు కోసం విద్యార్థుల పట్ల ఈ విధంగా ప్రవర్తించడం సరికాదు. ఫీజు కోసం వారిని బలవంతం చేయడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. అలా చేయడం ద్వారా విద్యార్థిని మానసికంగా వేధించడమే అవుతుంది. పాఠశాలలు వాణిజ్య సంస్థల్లా ప్రవర్తించకూడదు. విద్యార్థులను లోనికి రానివ్వకుండా చేయడం విద్యా సంస్థల ప్రాథమిక ధర్మానికి విరుద్ధం అని వ్యాఖ్యానించింది. డబ్బు అర్జించడమే లక్ష్యంగా పాఠశాలలు నెలకొల్పలేదు. విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించడం దాని ప్రధాన విధి. పాఠశాలలకు ఫీజుల చెల్లింపునకు సంబంధించి కోర్టు జారీ చేసిన ఆదేశాలు తల్లిదండ్రులు తప్పక పాటించాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది.

# తొక్కిసలాట ఘటనపై ఆర్సీబి విచారం

### మృతుల కుటుంబాలకు
### పదిలక్షల
### చొప్పన పరిహారం

**బెంగళూరు,జూన్5(సమయజ్యోతి):**

బెంగళూరు తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పరిహారం ప్రకటించింది. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆర్సిబి.. రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు వెల్లడించింది. కాగా, 18ఏళ్ల తర్వాత తొలిసారి ఆర్సీబి జట్టు-కప్ గెలిచిన సందర్భంగా బెంగళూరులో నిన్న విక్టరీ పరేడ్ నిర్వహించారు. అయితే, అభిమానులు భారీగా తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. మరణించినవారిలో ఓ పాపతోపాటు మహిళ కూడా ఉంది. దీంతో ఆర్సీబి విజయోత్సవం తీవ్ర విషాదాన్ని నింపింది.

# నెల్లూరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**నెల్లూరు,జూన్5(సమయజ్యోతి):**

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు మండలంలో రోడ్డు ప్రమాదంలో చోటుచేసుకుంది. ఎఎస్ పేట గ్రామ శివారులో ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు వెంకటరావుపల్లి గ్రామానికి చెందిన కూలీలుగా గుర్తించారు. తెల్లపాడులో పొగాకు గ్రేడింగ్ కోసం కూలీలు ఆటోలో వెళు ండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# ఆదర్శంగా తెలంగాణ అభివృద్ధి

## రైతులకు అండగా రేవంత్ సర్కార్

**కామారెడ్డి,జూన్5(సమయజ్యోతి):**

ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వం సలహాదారు, మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. తెలంగాన అభివృద్ధి ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు దేశానికి ఆదర్శమని, ఇతర రాష్ట్రాల వారు తెలంగాణను ఆధ్యయనం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో అందిస్తున్న పథకాలు, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎందుకు లేవో సమాధానం చెప్పాలన్నారు. గాలి మాటలు చెప్పే వారికి గట్టి సమాధానం ఇవ్వాలని అన్నారు. ప్రజలు ఆలోచించి.. మంచి పనిచేసే వారికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో నీటి, కరెంట్ కొరత లేదని స్పష్టం చేశారు. రైతు లేనిదే రాజ్యం లేదని, రైతు పంట పండిస్తేనే కడుపునిండా తిని బతుకుతామని, అలాంటి రైతును కాపాడుకోవాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమని షబ్బీర్ అలీ అన్నారు. సాగునీరు, ఉచిత కరెంటు, పంట పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర అందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వమని, రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక సీఎం రేవంత్ వివరించారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారని రైతులను బతికించాలనే ఉద్దేశంతో పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకున్నారని కొనియాడారు.

# పర్యావరణహితంగా హైదరాబాద్

## ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యం

**హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):**

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా మారాలన్న తపనతో సిఎంరేవంత్ అనేక చర్యలు తీసుకుంటున్నారని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మూసీ సుందరీకరణ ఇందులో భాగమేనని అన్నారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడంతో పాటు, అందమైన నగరంగా తీర్చిదిద్దడం కూడా తమ లక్ష్యంగా ఉందని అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రతకు ప్రజలుకూడా తోడ్పాటును ఇవ్వాలన్నారు. మననగరాన్ని మనమే మంచిచేసుకోవాలన్న లక్ష్యం రావాలన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏమీ చేయలేమని అన్నారు. ప్రజలు ఇది తమ నగరం అని గుర్తించి ముందుకు సాగాలన్నారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడానికి జరగాల్సిన పని చాలా ఉంది. సాగునీరు, తాగునీరు, అటవీ సంపద, పట్టణాభివృద్ధి, పరిశ్రమల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దేశంలోనే హైదరాబాద్ ఉత్తమ నగరంగా ఉందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇతర నగరాలతో పోల్చితే హైదరాబాద్ బాగానే ఉంది. ప్రపంచంతో పోల్చితే విశ్వనగరం కావాలంటే అనేక చర్య తీసుకోవాల్సి ఉందన్నారు. నగరంలో పచ్చదనం కోసం చెట్లను నాటి కాపాడాలని అన్నారు.

# మంచి ఆలోచనలే శ్రీరామరక్ష (ఆధ్యాత్మికం)

**తిరుమల,జూన్5(సమయజ్యోతి):**

చెడు వ్యసనాలు వదిలి నిర్మల మనస్సుతో ఉన్నంత కాలం మనలను ఏ మలినం ఆవరించదు. ఓ రకంగా నిర్మలమైన మనస్సు ఆరోగ్యానికి హేతువు.మన మనస్సు చేసే మంచి ఆలోచనలతోనే మన దేహం కూడా అదుపులో ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. చెడు ఆలోచనలను మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇకపోతే ఇది సత్యం. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా- చేయగలిగిందేమీ ఉండదు. మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించుకొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది. ఎవరో రావాలని, ఏదో చేయాలని భ్రమలో మునిగిపోతూ కర్తవ్యాన్ని మరచే మనిషిని దేవుడు కూడా బాగుపరచలేడు.

# కొండగట్టు వద్ద రోడ్డు ప్రమాదం

## కారును ఢీకొన్న డిసిఎం..చిన్నారి మృతి

## వరుడికి గాయాలతో ఆగిన పెళ్లి

**జగిత్యాల,జూన్5(సమయజ్యోతి):**

జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి పెళ్లి బృందంతో వెళ్తున్న కారు డిసిఎం ఢీకొట్టడంతో ఓ చిన్నారి మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వరుడు తీవ్రంగా గాయపడడంతో పెళ్లి ఆగిపోయింది. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెళ్లి బృందం నాందేడ్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడునెలల చిన్నారి మరణించగా, వరుడు తీవ్రంగా గాయపడ్డాడు. నాందేడ్‌కు చెందిన పెండ్లి బృందం హుజూరాబాద్‌కు కారులో వెళు న్నది. అందులో వరుడితోపాటు మరికొందరు ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 4 గంటల సమయంలో కొండగట్టు పంచముఖ ఆంజనేయ స్వామి రోడ్డు సమీపంలో ఓ మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం.. కారును ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి కారు ముందు భాగంగా నుజ్జునుజ్జు అయింది. దీంతో అందులో ఉన్న పెండ్లికొడుకుతోసహా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మూడు నెలల బాలుడు రుద్ర అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ప్రమాదం నేపథ్యంలో వివాహం నిలిచిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ం

# పోలీసుల టార్చర్ కారణంగా

# యువకుడు మృతి

## తెలంగాణ ప్రభుత్వానికి

## ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

**న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):**

పోలీసుల టార్చర్ కారణంగా యువకుడు మరణించాడంటూ మీడియాలో వచ్చిన కథనాల ధారంగా తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల సంఘం నోటీసులు జారీ చేసింది. ఇటీవల రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడి మరణంపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలంటూ నోటీసులు ఇచ్చింది. పోలీసుల టార్చర్ కారణంగా యువకుడు మరణించాడంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఎన్‌హెచ్‌ఆర్సీ పరిగణలోకి తీసుకుంది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న జాతీయ మానవ హక్కుల సంఘం.. ప్రభుత్వానికి నోటీ-సులు జారీ చేసింది.అలాగే ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ డీజీపీకి కూడా ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీ-సులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని కోరింది. మీడియా కథనాల్లో విషయాలు నిజమైతే, బాధితుడి మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించినట్లు-గా భావించాల్సి వస్తుందని కమిషన్ పేర్కొంది.

# మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వద్దు

**మాస్కులు ధరించే పరిస్థితి రావద్దన్న పొన్నం**

**తార్నాక ఆర్టీసీ ఆస్పత్రికి పర్యావరణ అవార్డు**

**హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):**

మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ చేయకపోవడంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. వాటిని సంరక్షించుకోవాలని కోరారు. ఇదిలావుంటే తెలంగాను రోడ్డు రవాణ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న తార్నాక ఆస్పత్రికి పర్యావరణ అవార్డు లభించింది. టీ-జీఎస్ ఆర్టీసీ తార్నక ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు దక్కింది. పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు లభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల కేటగిరిలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్ మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ తగ్గింపులో ఆస్పత్రి చేసిన కృషికి గాను ఈ అవార్డు వచ్చింది. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని సనత్ నగర్ టీ-బీపీసీబీ కార్యాలయంలో ఈ అవార్డును ఆస్పత్రి బృందానికి మంత్రి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డును టీ-జీఎస్ఆర్టీసీ ఆస్పత్రి బృందానికి ముఖ్యఅతిథిగా వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేశారు. తార్నాక ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు లభించడం పట్ల ఆ సంస్థ ఎండీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణను మెరుగుపర్చడం తోపాటు-, పర్యావరణ పరిరక్షణ కొనసాగించేందుకు ప్రేరణ అని అన్నారు ఆస్పత్రిలో బయో-మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎ÷-లాస్టిక్ వేస్ట్ తగ్గింపు, ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందిగా చేస్తోన్న వైద్యులు, సిబ్బందిని ఈ సందర్భంగా సజ్జనార్ అభినందించారు.

# ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం

## కేసును ఛేదించిన పోలీసులు

## నేపాల్ యువతిగా గుర్తింపు..హంతకుడూ నేపాలీయుడే

**హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):**

హైదరాబాద్ నగర శివారులోని బాచుపల్లిలో ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. మృతదేహాన్ని నేపాల్‌కు చెందిన యువతిగా గుర్తించారు. నేపాల్‌కు చెందిన విజయ్ అనే వ్యక్తి మే 23న యువతిని హత్య చేసి మృతదేహాన్ని ట్రావెల్ బ్యాగ్‌లో పెట్టి బాచుపల్లి-మియాపూర్ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కేపీహెచ్‌బీలో నిందితుడు సూట్ కేస్ కొనుగోలు చేసినట్టు- పోలీసులు ఆధారాలు సేకరించారు. బుధవారం ఉదయం ట్రావెల్ బ్యాగులో మహిళ మృతదేహం కలకలం రేపింది. ఇక్కడ రెండు రోజులుగా దుర్వాసన వస్తుండటాన్ని వాహనదారులు గుర్తించారు. బుధవారం సమస్య మరింత పెరగడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పెద్ద ట్రావెల్ బ్యాగును తెరిచి చూడగా 25-35 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతదేహం కనిపించింది. మెడలో మంచానికి ఉపయోగించే నవారు ఉండటాన్ని గమనించి ఆమెను హత్య చేసి ఉంటారని, ఎక్కడో వేరే ప్రదేశంలో హతమార్చి ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉంటారని భావించారు. ఒంటిపై ఎరుపు రంగు పంజాబీ దుస్తులు, చేతికి మట్టి గాజులు ఉన్నాయి. మృతదేహం తీరును బట్టి వారం నుంచి పది రోజుల క్రితం చనిపోయినట్లు- నిర్ధారించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించడంతో పోలీసులు నాలుగు బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**- పురుగు మందుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలి**

**- ప్లాస్టిక్ వినియోగిస్తే మనకు తీవ్ర అనారోగ్యం**

**- పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలి..**

**- కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ బ్యూరో సమయజ్యోతి**

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి కాపాడుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం మానకొండూర్ మండలం లలితాపూర్ పంచాయతీ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని.. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరం ఉండాలని కోరారు. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంట చేతికి వచ్చిన తర్వాత వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలన్నారు. పురుగుమందుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలన్నారు. పచ్చని భూమి, స్వచ్ఛమైన గాలి, అందరికీ మంచినీరు పర్యావరణ పరిరక్షణ తోనే సాధ్యమన్నారు.

ప్రకృతి రక్షణకు మొక్కలు నాటి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు.

మావ్లిన్నాంగ్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడారు.

మొక్కలు నాటి పరిశుభ్రత పాటిస్తున్నందుకు మేఘాలయ రాష్ట్రంలోని మావ్లిన్నాంగ్ గ్రామం ఆసియా ఖండంలోనే పరిశుభ్రమైన గ్రామంగా నిలిచిందన్నారు.

మీరు కూడా ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని.. పరిశుభ్రత పాటిస్తూ అభివృద్ధి చెందాలని సూచించారు.అనంతరం పర్యావరణ రక్షణ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో యునిసెఫ్





ప్రతినిధి కిషన్ స్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ఇందుర్తి ప్రయాణీకులకు తొలగనున్న కష్టాలు

**పూర్తయిన హుస్నాబాద్ ఇందుర్తి డబుల్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు**

**రేపు రోడ్డును ప్రారంభించనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**24 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన అంచనాలకు పాలనాపరమైన ఆమోదంలి**

**బండి సంజయ్ క్రుషితో సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన రహదారి విస్తరణ పనులు**

**నిర్ణీత గడువులోపే1(5 నెలల్లోపే) రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసిన అధికారులు**

**కరీంనగర్ సమయజ్యోతి,**

హుస్నాబాద్ %-% ఇందుర్తి వెళ్లే ప్రయాణీకులకు శుభవార్త. గుంతల మయమై మట్టికొట్టుకుపోయిన సింగిల్ లేన్ రోడ్డుపై ప్రయాణిస్తూ తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్న ప్రయాణీకులు ఇకపై డబుల్ రోడ్డుపై హాయిగా ప్రయాణించే అవకాశం కలిగింది. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల సంస్థ హుస్నాబాద్ %-% ఇందుర్తి సింగిల్ లేన్ మట్టిరోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించింది. మొత్తం రూ.24 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలకు 2022 డిసెంబర్ లో పరిపాలనాపరమైన అనుమతులు మంజూరైన విషయం తెలిసిందే. కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి(సీఆర్ఐఎఫ్) కింద నిధులు విడుదలయ్యాయి. 15 నెలల వ్యవధిలో ఈరోడ్డును నిర్మించాలని ఒప్పందం కుదిరింది. 2024 మార్చిలో డబుల్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. నిర్ణీత వ్యవధిలోపే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయడం విశేషం.

హుస్నాబాద్%-% ఇందుర్తి డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా దాదాపు 12.05 కిలోమీటర్ల పొడువునా నిర్మాణ పనులను పూర్తి చేశారు. ఇందుర్తి నుండి నవాబుపేట, కొండాపురం, అరెపల్లి, పొట్లపల్లి గ్రామాల మీదుగా హుస్నాబాద్ వరకు ఈ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా 22 పైప్ కల్వర్టులను పునర్నించారు. రోడ్డు పక్కనున్న బావులకు రక్షణ గోడలను సైతం నిర్మించారు. నిర్మాణ పనులన్నీ పూర్తి చేసుకోవడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రేపు (శుక్రవారం) ఉదయం హుస్నాబాద్%-%ఇందుర్తి రోడ్డును ప్రారంభించనున్నారు.

వ్యవసాయ భూముల నడుమ సాగే ఈ రోడ్డు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కేంద్రాలకు రవాణా చేయడంలో రైతులకు ఎంతగానో మేలు చేయనుంది. దీంతోపాటు హుస్నాబాద్ నుండి ఇందుర్తి మధ్యనున్న గ్రామాల రవాణా వేగవంతం కావడంతోపాటు ఎంతగానో ప్రయోజనం చేకూరనుందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మట్టికొట్టుకుపోయి గుంతలమైన హుస్నాబాద్%-%ఇందుర్తి సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు క్రుషి క్రుషి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు ప్రత్యేక క్రుతజతలు తెలియజేశారు. నిర్ణీత సమయంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ అధికారులకు, కాంట్రాక్ట్ సంస్థను స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు

# సౌదీలో గుండెపోటుతో బిఆర్ఎస్ కార్యకర్త మృతి

## కెటిఆర్ చొరవతో సొంతూరుకు మృతదేహం రాక

**హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):**

బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానని భరోసానిచ్చే కేటీఆర్, దేశం కాని దేశంలో గుండెపోటుతో మరణించిన కార్యకర్త మృతదేహాన్ని కుటుంబసభ్యుల చెంతకు చేర్చడంలో అండగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకర్గంలోని హేమ్లానాయక్ తండాకు చెందిన విస్లావత్ బాబ్యకు బీఆర్ఎస్ పైనా, కేసీఆర్ పైనా అంతులేని అభిమానం. ఓవైపు గులాబీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే బతుకుదెరువు కోసం వ్యవసాయం చేసుకునేవారు. సాగుబడి కష్టంగా మారడంతో సొంతూర్లో ఉండలేక బతకుదెరువు కోసం సంవత్సరం క్రితం సౌదీ అరేబియాకు వెళ్లారు. దురదృష్టవశాత్తు గత నెల 27 నాడు తీవ్రమైన గుండెపోటు- రావడంతో అక్కడే చనిపోయారు. సౌదీలో ఉండే కఠిన నిబంధనలతో మృతదేహాన్ని సొంతూరుకు రప్పించడంలో కుటుంబసభ్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో విస్లావత్ బాబ్యను కడసారైనా చూసుకోలేమంటూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలియజేశారు. భారత విదేశాంగ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పక్రియను పూర్తి చేసేందుకు వారికి అవసరమైన సమాచారాన్ని దౌత్యకార్యలయానికి అందించారు. ఇంతేకాదు తాను విదేశీ పర్యటనలో ఉన్నా కూడా మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. కేటీఆర్ చొరవతో విస్లావత్ బాబ్య మృతదేహం రాత్రి స్వగ్రామానికి చేరడంతో గురువారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. చివరి చూపు నోచుకుంటామో లేదో అని ఆందోళన ఉన్న తమకు అండగా నిలిచిన కేటీఆర్, అంజయ్య యాదవ్‌లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటి నిర్మాణం కోసం లంచం డిమాండ్

**ఎసిబికి దొరికి పోయిన ఆర్ఐ**

**నిర్మల్,జూన్5(సమయజ్యోతి):**

కొత్త ఇంటి నిర్మాణం కోసం అసెస్మెంట్ నెంబర్ కేటాయించడానికి సంబంధిత ఇంటి యజమాని నుండి డబ్బులు డిమాండ్ చేసిన ఆర్ఐ ఎసిబికి దొరికిపోయాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి షోయబులు ఇంటి నిర్మాణం కోసం యజమాని నుండి డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి ఎసిబిని సంప్రదించాడు. ఈ క్రమంలో కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా వారిద్దరిని ఎసిబి డిఎస్పి విజయ్ కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో లంచం అడగడం నేరమని అన్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని శుక్రవారం కరీంనగర్ కోర్టు హాజరుపరిస్తామని పేర్కొన్నారు.

# నేడు యాదాద్రికి సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకి శంకుస్థాపన చేయనున్నారు. గంధమల రిజర్వాయర్‌కి , ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కి, యాదగిరిగుట్ట వేద పాఠశాలకి శంకుస్థాపన చేస్తారు. యాదగిరిగుట్ట మెడికల్ కాలేజీకి ఫౌండేషన్ స్టోన్ వేయనున్నారు. తుర్కపల్లి పబ్లిక్ మీటింగ్‌లో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసగించనున్నారు.

# సౌతాఫ్రికాలో రోడ్డు ప్రమాదం

## హైదరాబాద్ యువకుడు దుర్మరణం

**హైదరాబాద్,జూన్5(సమయజ్యోతి):**

సౌతాఫ్రికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మారుతీ నగర్‌కు చెందిన లిఖిత్ గౌడ్ అనే యువకుడు సౌతాఫ్రికా వెళ్లాడు. అయితే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో లిఖిత్‌గౌడ్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కుటు-ంబానికి చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో బాలాపూర్ మండలం మీర్‌పేట్ కార్పొరేషన్ లోని మారుతీ నగర్‌కు చెందిన దుర్గాపతి ప్రమోద్‌గౌడ్ కుమారుడు లిఖిత్‌గౌడ్ (27) ఏడాదిన్నర క్రితం సౌతాఫ్రికాలోని బొత్స్వానాలోని స్ప్రాట్ డ్రిల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. అక్కడ తన మిత్రులతో కలిసి ఉంటున్నాడు. గత నెల 30న కంపెనీ పని నిమిత్తం సిబ్బందితో కలిసి కారులో వెళ్తుండగా వేగంగా దూసుకువచ్చిన భారీ వాహనం వారి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లిఖిత్ గౌడ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయినట్టు- కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదం విషయం తెలియగానే లిఖిత్ కుటు-ంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చెట్టంత కొడుకు ఇక లేడనే విషయాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. కాగా లిఖిత్ మృతదేహానికి పోస్టుమార్టం కార్యక్రమాలు పూర్తి చేసి మీర్‌పేట్‌కు పంపించడానికి అక్కడి భారత హైకమిషన్ అధికారులు చర్యలు తీసుకుంటు-న్నారు

# వేడుకల కన్నా ప్రాణాలు ముఖ్యం

**బెంగళూరు దుర్ఘటనపై కపిల్ దేవ్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,జూన్5(సమయజ్యోతి):**

బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనపై ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. తాజాగా స్పందించిన భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వేడుకల కంటే ప్రాణాలు ముఖ్యమని ఈ సందర్భంగా కపిల్ పేర్కొన్నారు. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో అభిమానులు ప్రాణాలు కోల్పోయారనే వార్త ఎంతో బాధ కలిగించింది. ఇలాంటి ఘటనలు జరగకూడదని కోరుకుంటు-న్నా. ఈ ఘటన తర్వాత మనం మరో విషయం తెలుసుకోవాలి. మరోసారి ఇలాంటి కార్యక్రమాలు జరిగినప్పుడు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. గొప్ప క్షణాలను వేడుకగా చేసుకునే సమయంలో పెద్ద ప్రమాదాలకు దారి తీయకుండా జాగ్రత్త వహించాలి. భవిష్యత్తులో ఏదైనా జట్టు- గెలిస్తే ప్రశాంతంగా సంబరాలు చేసుకోవాలి. వేడుకల కంటే జీవితాలు చాలా ముఖ్యమైనవి. ఇకపై జాగ్రత్తగా ఉందాం' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# బెంగుళూరు ఘటనపై దిద్దబాటు చర్యలు

**పోలీస్కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు**

**బెంగళూరు,జూన్5(సమయజ్యోతి):**

ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చోటుచేసుకున్న విషాద ఘటనపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. బెంగళూరు పోలీస్ కమిషనర్‌తో పాటు తొక్కిసలాటతో సంబంధం ఉన్న ఇతర పోలీస్ ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీఎం సిద్ధరాయ్య ఆదేశాలు జారీ చేశారు. ఆర్సీబీ, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులను అరెస్టు చేయాలని సీఎం ఆదేశించారు. తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు చేసేందుకు విశ్రాంత హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు- సిద్ధరామయ్య తెలిపారు. ఈ కమిషన్ 30 రోజుల్లో నివేదిక సమర్పిస్తుందని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం ర్యాలీ

**కరీంనగర్ సమయజ్యోతి**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్వదేశీ జాగరన్ మంచ్ , వాకర్స్ ఆధ్వర్యంలో గురువారం రోజున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగర్లో పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు..ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా వచ్చే వివిధ రకాల వ్యాధులు మానవ మనగడకే ప్రమాదకరమని, అలాగే చెట్లను నాటిపచ్చదనాన్ని పెంపొందించుకుంటే పర్యావరణాన్ని కాపాడవచ్చని వారు ఈ సందర్భంగా తెలిపారు .. ఈ సందర్భంగా స్టేడియం లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కన్వీనర్ సిఏ హరీష్ బాబు , వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుడిపాటి రమణారెడ్డి, అన్నమనేని సుధాకర్ రావు ,డాక్టర్ అమర్నాథ్ పెంచాల కిషన్ రావు, హార్ట్ ఫీట్ వాకర అసోసియేషన్ ప్రవీణ్ ,యోగా కోచ్ కిష్టయ్య, శ్రీరామ మహర్షి ,యోగ గురువు కుమార్ మహర్షి , పెద్ద సంఖ్యలో వాకర్స్ పాల్గొన్నారు.






# పెళ్లి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**సమయజ్యోతి రామన్నపేట మండలం జూన్ 5**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామ మాజీ సర్పంచ్ మెట్టు మహేందర్ రెడ్డి వివాహము మిర్యాలగూడలోని బండి కన్వెన్షన్ హాల్లో జరగగా అట్టి వివాహమునకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేశపాక లక్ష్మీనరసింహ, మాజీ ఉప సర్పంచులు పల్సం భిక్షం, సామ సుధాకర్ రెడ్డి నాయకులు మల్లయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొనడం జరిగింది.



# గీతంలో జాతీయ చర్చాగోష్ఠి

- మల్టీడిసిప్లినరీ ఇంజనీరింగ్ లో ధోరణులు, ఆవిష్కరణలపై
- ముఖ్య అతిథిగా లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నీ
- వక్తలుగా వింగ్ కమాండర్లు, పరిశ్రమ నిపుణులు

**పటాన్చెరు / సమయజ్యోతి**

నూతన విద్యా సంవత్సరం ఆరంభంలోనే, అధునాతన అంశాలపై అవగాహన కల్పించే జాతీయ చర్చాగోష్ఠికి హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ వేదిక కాబోతోంది. 'మల్టీడిసిప్లినరీ ఇంజనీరింగులో ధోరణులు, ఆవిష్కరణలు' అనే అంశంపై జూలై 10, 11 తేదీలలో ఒక జాతీయ స్థాయి చర్చాగోష్ఠిని నిర్వహించినున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రక్షణ, విద్య, పరిశ్రమల నుంచి ఆలోచనాపరులైన నాయకులను ఆహ్వానించి, ఇంజనీరింగ్ భవిష్యత్తును రూపొందిస్తున్న తాజా సాంకేతిక పురోగతిపై అంతర్దృష్టులను పంచుకునే వేదికగా ఈ చర్చాగోష్ఠిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమం వివిధ రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించి, వినూత్న, బహుళ విభాగాల పరిష్కారాలపై చర్చలను ప్రేరేపిస్తుందని తెలిపారు.ఈ రెండు రోజుల చర్చాగోష్ఠిలో ముఖ్య అతిథిగా ఎంసీఈఎంఈకి చెందిన లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నీ పాల్గొంటారని, అలాగే భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్లు పలువురు వక్తలుగా తమ ఆలోచనలను పంచుకుంటారని వివరించారు.తొలి రోజు (జూలై 10న) ఉన్నత విద్య, ఏరోస్పేసులో విద్యా సలహాదారు ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్ 'వైమానిక యుద్ధానికి ఉద్భవిస్తున్న సాంకేతిక అవకాశాలు' అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.హైదరాబాదులోని భారత వైమానిక దళ అకాడమీకి చెందిన వింగ్ కమాండర్ శివంచల్ అస్థానే భారత వైమానిక దళంపై ప్రేరణాత్మక ప్రసంగాన్ని వెలువరించనున్నారు.భారత నావికా దళంపై కమాండర్ రవి ప్రకాష్ సింగ్ తన అనుభవాలను పంచుకుని, యువ మనస్సులను ప్రేరేపిస్తారని తెలియజేశారు.రెండో రోజు (జూలై 11న) భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ ఆర్. ప్రధాన్‌బీ హైదరాబాదులోని అడ్వాన్స్ డ్ సిస్టమ్స్ లాబొరేటరీ (ఏఎస్ఎల్) డైరెక్టర్ బి.వి. పాపారావుబీ హైదరాబాదు విశ్వవిద్యాలయం ఆచార్యుడు ప్రొఫెసర్ సిబా కె.ఉద్గాట ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.ఈ విశిష్ట వక్తలు రక్షణ ఆధారిత ఆవిష్కరణలు, ఉద్భవిస్తున్న సాంకేతికతలు, వాటి అంతర్-విభాగ అనువర్తనాలపై వారి దృక్పథాలను పంచుకుంటారని తెలిపారు. ఇది ప్రభావవంతమైన విద్యా-పరిశ్రమ భాగస్వామ్యాలతో పాటు పరిశోధనలో సహరించుకునేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నామన్నారు.ఈ చర్చాగోష్ఠిలో పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తల ఉపన్యాసాలు, విశిష్ట సాయుధ దళాల అధికారుల ప్రేరణాత్మక ప్రసంగాలతో పాటు ముఖాముఖిలో సందేహాల నివృత్తి వంటివి ఉంటాయని వివరించారు.

# ఆపరేషన్ సింధూర్ ఒక ఆపరేషన్ కాదు

## ఒక భావోద్వేగానికి రూపం... బాధితుల పట్ల బాధ్యతకు సంకేతం

ఇండియన్ ఆర్మీ పవర్ ఏంటో, యుద్ధం భయం ఏమిటో పాకిస్తాన్ రుచి చూసింది..

మన శక్తి ప్రపంచానికి తెలిసింది..

అంతర్జాతీయ వ్యవహారాల , టీవీ విశ్లేషకులు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ గిరిధర్ మామిడి....

**కరీంనగర్ సమయజ్యోతి**

ఆపరేషన్ సిందూర్ అనే పేరుకు ఉన్న అర్థం అత్యంత భావోద్వేగ పూరితమైనదని, ఈ పేరును ఎంపిక చేయడంలో భారత ప్రభుత్వం చూపిన సామాజిక స్పర్శ, మానవీయ దృక్పథం, న్యాయం పట్ల ఉన్న నిబద్ధత స్పష్టంగా కనిపిస్తాయని , అందుకే ఆపరేషన్ సింధూరం ఒక ఆపరేషన్ కాదని, ఒక భావోద్వేగానికి రూపం , బాధితుల పట్ల బాధ్యతకు సంకేతం లాంటిదని అంతర్జాతీయ వ్యవహారాల , టీవీ విశ్లేషకులు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ గిరిధర్ మామిడి అన్నారు. ప్రజ్ఞాభారతి, వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ (సీజ్ ఫైర్) అంశంపై కరీంనగర్లోని వైశ్య భవన్లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ పేరు వెనుక ఉన్న గాఢమైన భావన ను ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు.

'సిందూర్' అంటే భారత సాంప్రదాయంలో ఒక మహిళ భర్త బతికివున్న ప్రతీక కు నిదర్శనం లాంటిదని, . అది ఆమె గౌరవానికి, భద్రతకు, భార్యగా ఉన్న స్థానానికి చిహ్నంగావ్యవహరించబడుతుందన్నారు. పహల్గామ్ లో ఉగ్రవాదులు కేవలం పురుషులనే లక్ష్యంగా చేసుకుని 26 మందిని అత్యంత కిరాతకంగా హత్య చేయడం వలన, అనేక మంది స్త్రీలు ఒక్కసారిగా వితంతువులయి , సింధూరం కోల్పోయినవారయ్యారన్నారు. ఈ విషాదంలో మహిళలకు జరిగిన అన్యాయాన్ని గుర్తు చేస్తూ, ఆపరేషన్ సిందూర్ అనే పేరు ఎంపిక చేశారని తెలిపారు.ఇది కేవలం సైనిక ప్రతీకార చర్యకే కాదు, ఒక సాంఘిక న్యాయం కోసం భారత సైన్యం చేసిన ప్రయత్నానికి గుర్తు లాంటిదన్నారు. దీనివల్ల దేశం మొత్తానికి, ముఖ్యంగా బాధిత మహిళలకు , ఒక భద్రతా భరోసా ఇచ్చే ప్రయత్నం జరిగిందన్నారు. భారత సైన్యం బాధితులను మరచిపోకుండా వారికోసం నిలబడుతున్న తీరును చూసి దేశం మొత్తం గర్వపడుతుందన్నారు. భారతదేశ – పాక్ యుద్ధ వాతావరణ నేపథ్యంలో ముఖ్యంగా మన ఆయుధ సంపత్తి అందరినీఅబ్బురపరిచాయన్నారు. పాకిస్తాన్లో ఉన్న తీవ్రవాద స్థావరాలన్నీ కచ్చితత్వంతో నేలమట్టం చేసిన ఘనత ఇండియన్ ఆర్మీకి దక్కుతుందన్నారు. అందుకే దేశంలో అందరి నోటా "సెల్యూట్ టు ఇండియన్ ఆర్మీ " అని ఒకే మాట వినిపించిందన్నారు. అమెరికా ఆఫ్ఘనిస్తాన్ పై దశాబ్దాలు యుద్ధం చేసి కంట్రోల్ లోకి తెచ్చుకోలేకపోయిందని, రష్యా ఉక్రెయిన్ పై మూడు సంవత్సరాలుగా యుద్ధం చేసి కంట్రోల్ లోకి తెచ్చుకోలేక పోయిందన్నారు. టర్కీ, చైనా లాంటి దేశాలు దొంగ చాటుగా పాకిస్తాన్కు అన్ని విధాలా సహకరించిన భారత్ ఆపరేషన్ సింధూర్ తో కేవలం 25 నిమిషాల ట్రయల్ వార్ మాత్రం చూపించి పాకిస్తాన్నీ అష్టదిగ్బంధనం చేసి కంట్రోల్లోకి తెచ్చి, కాలభైరానికి వచ్చేటట్లు చేసిందన్నారు. యుద్ధంలో ప్రాణాలకు తెగించి పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించిన భారతదేశ త్రివిధ దళాలకు అశేష పనితీరుపై సర్వత్ర అభినందనలు , విజయ నీరాజనాలు వెల్లువత్తాయ అన్నారు. సీజ్ ఫైర్ విషయంలో భారతదేశం వ్యూహాత్మకంగా వ్యవహరించిందన్నారు. రాజు అంటే శత్రువులను చంపడమే కాదు తన దేశాన్ని ఎలా రక్షించుకోవాలన్నా రాజనీతి తెలిసి ఉండాలని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ప్రపంచానికి దేశం యొక్క శక్తి సామర్థ్యాలను చూపించి , మెప్పించి ఒకింత ఉలికిపాటు గురి చేయగలిగే లాజిక్ తెలిసి ఉండాలని, సంవత్సరాలు యుద్ధం చేసి తన దేశ ఆర్థిక వ్యవస్థను మానసిక స్థితిని దిగజార్చకుండా, తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో గెలుపును అందుకోగలిగే బుద్ధి కుశలత ఉండాలని తెలిపారు. అలాంటి దిశలోనే భారత ప్రభుత్వం నడిచిందని, మన శక్తి ప్రపంచానికి తెలిసేలా చాటి చెప్పారన్నారు. యుద్ధం ముగియలేదని ఇది తాత్కాలిక విరామమే న్నారు. ఇట్టి కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి అధ్యక్షులు సముద్రాల నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ , రాష్ట్ర బాధ్యులు ఎల్ రాజా భాస్కర్ రెడ్డి, సీఏ నిరంజనా చారి , కార్య దర్శి మందల నగేష్ రెడ్డి, వైశ్య సేవ కేంద్రం అధ్యక్షులు చిదుర సురేష్, కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, సత్యనారాయణ రెడ్డి, మురళి




# విద్యార్థులూ.. కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

## ఫోన్ కు దూరంగా పుస్తకాలకు దగ్గర ఉండాలి

## చదువు , క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థానాలకు..కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ సమయజ్యోతి**

ఆధునిక కాలంలో కంప్యూటర్ వినియోగం అత్యవసరమైందని.. విద్యార్థులు కంప్యూటర్ పై పట్టు పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కలెక్టరేట్ లోని చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఫోటోషాప్ పై నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శిక్షణ తరగతులు ముగిశాయి. గురువారం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఫోన్ కు దూరం ఉండి పుస్తకాలకు దగ్గర ఉండాలని విద్యార్థులకు సూచించారు. చదువు, క్రమశిక్షణను నమ్ముకుంటే ఉన్నత స్థానాలకు ఎదుగుతామని.. దీంతో సమాజంలో గౌరవం వస్తుందన్నారు. ప్రతిరోజు కంప్యూటర్ పై ప్రాక్టీస్ చేయాలన్నారు. హోంవర్క్ గా ఒక పేజీ టైప్ చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇది భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు కూడా కంప్యూటర్ పై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా నియంత్రణ అధికారి అశోక్ రెడ్డి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ వెంకట రాంబాబు, ప్రోగ్రాం ట్రైనర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.






# అమీన్పూర్ మున్సిపాలిటీలో విలీనమైన వడకపల్లి, జనగంపేట్ గ్రామాలు

## - అమీన్పూర్ మున్సిపల్ కమిషనర్

**అమీన్పూర్ / సమయజ్యోతి**

అమీన్‌పూర్ మునిసిపాలిటీలో విలీనమైన వాడక్‌పల్లి మరియు జనకంపేట్ గ్రామాల రికార్డులను అమీన్‌పూర్ మునిసిపల్ కమిషనర్ స్వాధీనం చేసుకున్నారు.అఈ సందర్భంగా డీ ఈ ఈ , ఎ ఈ , టీపి ఓ , మేనేజర్ మరియు ఎంపీ ఓ అమీన్ పూర్ పాల్గొన్నారు.



# రైతుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

## రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ సమయజ్యోతి**

భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన భూమి దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం మానకొండూరు మండలం చెంజర్ల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు తెలుసుకున్నారు. రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే భూభారతి చట్టము తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా ఒక రైతు తన భూ సమస్య గురించి చెప్పుకోగా.. ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నారుల ఆత్మీయ నేస్తం బాలభవన్.. కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ సమయజ్యోతి**

చిన్నారులకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ నిస్తూ.. వారికి బాల భవన్ ఆత్మీయ నేస్తంగా మారిందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆడిటోరియంలో విద్యాశాఖ, బాల భవన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. 45 రోజుల శిక్షణ శిబిరంలో సంగీతం, జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యం, మృదంగం, కర్ర సాము, అబాకస్, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్, యోగా అంశాల్లో నిపుణులు సుమారు 938 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

ముగింపు వేడుకల్లో చిన్నారుల ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల భవన్ శిక్షకులు ఓపికగా చిన్నారులకు శిక్షణ నిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీస్తున్నారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు కళలపై ఆసక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యా నియంత్రణ అధికారి అశోక్ రెడ్డి, బాల భవన్ సూపరిండెంటెంట్ మంజులా దేవి, ఇన్స్ట్రక్టర్ శ్రీధర్, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణలో ఎపిని అగ్రగామిగా నిలబెడతాం

వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం

వచ్చే ఏడాదికల్లా ప్లాస్టిక్ వినియోగం లేకుండా చేస్తాం

వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తాం

రాఖీ రోజున అన్నల నక్షాత్రానికి అనుగుణంగా విత్తనాల పంపిణీ

వనజీవి రామయ్య స్ఫూర్తిని మువలేము

పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు

పవన్ కళ్యాణ్‌తో కలసి మొక్కలు నాటిని బాబు

**అమరావతి,జూన్5(సమయజ్యోతి):**

వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మొన్నటి వరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈరోజు ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలు కూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. అందుకే ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం. మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్ పర్యావరణ పరిరక్షణ అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి. రాయలసీమలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోంది. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే మార్గాలు ఉన్నాయి. వరి వ్యర్థాల నుంచి కూడా బయో ఫ్యూయల్ తయారు చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలను గతంలోనే ప్రారంభించాం. తెదేపా ప్రారంభించిన ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసిందని చంద్రబాబు అన్నారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని తెలిపారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేపలు, చికెన్, ఇళ్లలో నుంచి వచ్చే వేస్ట్‌తో రీసైక్లింగ్‌కు ఉపయోగిస్తామన్నారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలు ఉన్నాయన్నారు. ఎర్రచందనంతో పాటు నల్లమల అడ వులలో ఉన్న వనమూలికలనూ కాపాడు కోవాలని చెప్పుకొచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని.. వచ్చే మూడేళ్లలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు వస్తున్నాయన్నారు. వచ్చే ఏడాది నాటికి పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తామన్నారు. 175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఇదే రోజు కోటి మొక్కలు నాటాలని సంకల్పం పెట్టుకున్నాం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.. అమరావతి రాజధాని ప్రాంతం అనంతవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం - వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభం అయింది. సభ ప్రాంగణంలో ఏర్పాటైన స్టాళ్లను పరిశీలించారు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కొంతమంది మంత్రులు అధికారులు కూడా స్టాళ్లు పరిశీలించారు.. స్టాల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు చంద్రబాబు, పవన్ కళ్యాణ్... పర్యావరణ దినోత్సవానికి గుర్తుగా మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవన్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఇదే రోజు కోటి మొక్కలు నాటాలని సంకల్పం పెట్టుకున్నాం అన్నారు.. అడవుల్లో కార్చిచ్చు ఆపే ప్రయత్నాలు చేయాలన్న ఆయన.. అటవీ పరిరక్షణ సమితి ఉద్యమకారులు అంకారవు అడవుల పరిరక్షణకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు.. గతంలో ఇంటి అడ్రస్ కావాలంటే అదిగో.. ఆ మర్రిచెట్టు పక్కవీధిలో అనేవారు.. ఇప్పుడు అసలు అలాంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ తలమానికంగా ఉండాలని ఆకాక్షించారు.. ఇక, అందరికి మనస్ఫూర్తిగా పర్యావరణ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: పవన్

**అమరావతి,జూన్5(సమయజ్యోతి):**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్టుపెట్టారు. భవిష్యత్ తరాలకి అందించాల్సిన గొప్ప బహుమతి శుభ్రమైన పర్యావరణం.. చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచుదాం.. నీటి కాలుష్యాన్ని నివారిద్దాం నీటి వనరులను కాపాడుకుందాం.. వన్యప్రాణులను రక్షించుకుందాం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షిద్దాం.. పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. భవిష్యత్ తరాల భద్రతకై కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు.. ఇక, సుసంపన్నమైన ప్రకృతిని మన పిల్లలకు బహుమతిగా ఇద్దాం.. ఇది మన భూమి.. ఇది మన బాధ్యత అని తన ట్వీట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు..

## ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే లక్ష్యం

పెట్టుడులు రాకూడదన్నది జగన్ ఆలోచన

పనిలేకనే వెన్నుపోటు దినమంటూ ఆందోళనలు

ఇలాగే చేస్తే 11లో 10 పోతాయని రామ్మోహన్ ఎద్దేవా

**శ్రీకాకుళం,జూన్5(సమయజ్యోతి):**

వైకాపా అధినేత జగన్.. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే పనిగా పెట్టుకున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. వైకాపా ప్రభుత్వం చెయ్యలేని ఎన్నో పనులను కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసి చూపించిందని అన్నారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిలో దురుద్దేశ ఆందోళనలు తప్ప నిర్మాణాత్మక సూచనలు చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలి. పెట్టుడులు రాకూడదన్నది జగన్ ఆలోచనగా ఉందన్నారు. రాష్ట్రానికి జగన్ తీరని ద్రోహం చేశారు. అందుకే ప్రజలు ఆ పార్టీని 11కే పరిమితం చేశారు. జగన్ తీరు మార్చుకోకపోతే 11లో ఈసారి మిగిలేది ఒకటే అని రామ్మోహన్ నాయుడు ఎద్దేవా చేశారు. వెన్నుపోటు దినోత్సవం కేవలం పనిలేక చేసినట్టుగా ఉందని.. కూటమి ప్రభుత్వంలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం చాలా కార్యక్రమాలు చేసిందన్నారు. ఏడాది కాలంలో పెన్షన్, అన్నక్యాటీన్, ఉచిత గ్యాస్ సిలిండర్, యువతకి డీఎస్సీ వంటి కార్యక్రమాలు చేసిందన్నారు. కేందప్రభుత్వం సహకారంతో అమరావతి, పోలవరం, రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ వంటి అసలు జరగవు అనుకున్న కార్యక్రమాలు చేసి చూపించామని తెలిపారు. ప్రతిపక్షానికి ఆనాడే ప్రజలు వెన్ను విరిచారని.. అందుకే 11 సీట్లకు రాష్ట్ర ప్రజలు పరిమతం చేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మోడీ కలిసి ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రానికి ఉపయోగపడే పని ఒక్కటి కూడా చెయ్యడం లేదని.. ఆ బ్రాండ్ వాల్యూ తియ్యడానికి వైసీపీ చూస్తోందన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశం రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయడమే అని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ.. రాష్ట్రంలో ఎదో జరిగిపోతుందని ప్రజలు అనేకునేలా చేస్తున్నారన్నారు. ఇలానే కొనసాగిస్తే వైఎస్ఆర్సీసీకి రానున్న రోజుల్లో 11లో 10 తీసి ఒక్క సీటుకే పరిమితం చేస్తారని విమర్శించారు. ఇక్కడ జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో మంత్రిపాల్గొన్నారు. అలాగే మొక్కులు నాటారు.



# హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా వనమనోహత్సవం

2.60 లక్షల మొక్కలు నాటాలన్న సంకల్పం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీలో కలెక్టర్

**విజయవాడ,జూన్5(సమయజ్యోతి):**

హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది వనమనోహత్సవం సందర్భంగా 2.60 లక్షల మొక్కలు నాటాలన్న సంకల్పంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పచ్చదనంతో కళకళలాడుతూ జిల్లాకు బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకొచ్చేందుకు కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నగరంలోని సత్యనారాయణపురంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని గురువారం కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. మారుతున్న వాతావరణ మార్పులతో పాటు సంప్రదాయ ఇంధన వనరులను అవసరానికి మించి వినియోగిస్తుండటం వల్ల విపరీతమైన కాలుష్యం ఏర్పడి ఎన్నో అనర్థాలకు దారితీస్తోంద న్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలకు కారణం వాతావరణంలో సమతుల్యత దెబ్బతినడమేనన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలంటే మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడమేనన్నారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షిస్తే చాలని.. దేశం పచ్చదనంతో విరాజిల్లుతుందన్నారు. జిల్లాలో ఈ ఏడాది వనమహోత్సవంలో 2 లక్షల 60 వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశిరచు కున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా చేపట్టే కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. పట్టణాల్లో సాధ్యమైనంత మేరకు మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరముందన్నారు. భూమిపైనే కాక భవనాలపై మిద్దెతోటలను పెంచినట్లయితే నగరాన్ని కాలుష్యం కోరలు నుంచి కాపాడు కోగలుగుతామన్నారు. మొక్కలు నాటి సంరక్షించేందుకు ముందుకు వచ్చే ప్రతిఒక్కరికీ అవసరమైన మొక్కలను అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు. ర్యాలీలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, సేఫ్ ఎన్విరాన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వన్ ఎర్త్‌వన్ లైఫ్ ప్రతినిధి ఏలూరి లీలా కుమారి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, విద్యార్థినులు తదితరులు హాజరయ్యారు.

# గిన్నస్ బుక్ రికార్డు సాధించేలా యోగా

జూన్ 21 విశాఖలో 5లక్షల మందితో నిర్వహణ

ముఖ్య అతిథిగా ప్రధాని మోడీ రాక

రీ సైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకువస్తాం: చంద్రబాబు

**అమరావతి,జూన్5(సమయజ్యోతి):**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ యోగా కార్యక్రమం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంలోని ఆర్కేబీచ్‌లో 5 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు జారీ అవుతాయని ప్రకటించారు. యోగా అనేది ప్రజలందరి జీవితంలో భాగమైందని.. ప్రజలు ఆరోగ్యవంతులు కావాలని కోరుకున్నారు. ఏపీలో గ్రీన్ కవర్ పెంచటం, గ్రీన్ ఎనర్జీ సాధించటం, సర్క్యులర్ ఎకానమీ, ప్రజల ఆరోగ్యం కోసమే యోగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్లాస్టిక్ మానవాళికి పెనుసవాల్‌గా మారిపోయిందని తెలిపారు. ఆవులు, గేదెలు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయని.. ఆ పాలనే మనం తాగుతున్నామని వివరించారు. ఏనుగులు కూడా ప్లాస్టిక్ తిని అనారోగ్యం పాలవుతున్నాయని చెప్పారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడా కనిపించకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. భూతాపంతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని.. గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికి సవాల్‌గా మారిందని చెప్పుకొచ్చారు. వర్షాలు తగ్గాయి, భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి, సాగునీరు తగ్గిపోతోందని అన్నారు. భూగర్భ జలాల్లో ఎ÷-లోరైడ్ పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఏపీలోని 68 నియోజకవర్గాల్లో ఉన్న నగరవనాలను 175 నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రీసైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకురావాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని అనంతవరం గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో డిప్యూటీ-సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రీసైక్లింగ్ అంశంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో పచ్చదనం పెంచేందుకు ప్రధాని నరేంద్రమోడీ చేసిన సూచనలు సైతం పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మియావాకీ గార్డెన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలంటూ దిశానిర్దేశం చేశారు. మలేషియా, సింగపూర్, సౌత్ కొరియా, జపాన్, అమెరికాలో మియావాకీ విధానాలపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. పంచాయతీ రాజ్, పట్టణాభివృద్ధి, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల సమన్వయంతో ప్రతీ 15 రోజులకోసారి రీసైక్లింగ్ విధానంపై తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సైక్లింగ్‌పై మూడు ప్రాంతాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి.. మొబైల్ వాహనం ద్వారా కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణతోపాటు- పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రోవైపు రాజధాని అమరావతిని కూటమి ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న క్రమంలో ఆ ప్రాంతలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతోంది. భవిష్యత్తులో కనీసం 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. సింగపూర్, జపాన్‌తో సంప్రదించి అక్కడ ప్లాంటేషన్ ఎలా ఉందో.. అదే తరహాలో ఇక్కడ సైతం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.



# బీచ్ టూరిజం అభివృద్ధికి కృషి

మసూల బీచ్ ఫెస్టివల్ ద్వారా తొలి అడుగు

మంగినపూడిలో నాలుగు రోజులు ఉత్సవాలు

బీచ్ ఫెస్ట్ ప్రారంభించిన మంత్రులు

**మచిలీపట్నం,జూన్5(సమయజ్యోతి):**

ఏపీలో బీచ్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. మసూల బీచ్ ఫెస్టివల్ ద్వారా తొలి అడుగు వేశామని తెలిపారు. మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఇంత పెద్ద బీచ్ ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే మసూల బీచ్ ఫెస్ట్ అతి పెద్దదని అన్నారు. మసూల బీచ్ ఫెస్టివల్‌ని మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర పర్యాటకశాఖమంత్రి కందుల దుర్గేశ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీచ్ ఫెస్ట్... పర్యాటకులు, జిల్లావాసులకు వినోదం, ఆహ్లాదం, అన్ని రాష్ట్రాల రుచులను అందించనుంది. విద్యా, సాంస్కృతిక కేంద్రంగా.. స్వాతంత్ర్య, రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలిచిన మచిలీపట్నం చరిత్రను గుర్తు చేసేలా మంగినపూడిలో నాలుగు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 5 నుంచి 8 వరకు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, జాతీయ స్థాయిలో సి-కయాకింగ్, కనోయింగ్ బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీ-లు నిర్వహిస్తున్నారు. 80 అడుగుల అమరావతి ఐకానిక్ టవర్, 100 అడుగుల ఎత్తులో జాతీయ పతాకం శాశ్వత నిర్మాణాలుగా ఏర్పాటు- చేశారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. టూరిజం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటించారు. 2018లో మసూల బీచ్ ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించామని.. కానీ గత వైసీపీ పాలకులు నాశనం చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీచ్‌లోకి రావడానికి కూడా లేకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరును మార్చేందుకు ఈ ఫెస్ట్ ద్వారా అడుగులు వేశామని చెప్పారు. అమరావతిలోని అసెంబ్లీ నమూనాను ఫెస్టివల్‌కి వచ్చేవారికి కనువిందు చేసేలా ఏర్పాటు- చేశామని వెల్లడించారు. పింగళి వెంకయ్యని స్మరించుకుంటూ.. అతి పెద్ద జాతీయ జెండా ఏర్పాటు- చేసుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నాలుగు రోజుల పాటు- జరిగే పండుగలో అడ్వెంచర్ స్పోర్ట్స్, పారా ÷-లగైడింగ్, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్‌తో సహా చాలా ఏర్పాట్లు- చేశామని అన్నారు. దేశంలోని అన్ని రుచులు ఒకే చోట అందించబోతున్నామని చెప్పుకొచ్చారు. స్వదేశీ దర్శన్ కింద నిధులు తీసుకొచ్చి టూరిజం అభివృద్ధికి అధికారులు సహకారం అందించాలని కోరారు. హోటల్స్, రిసార్ట్ ఏర్పాటు- చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బందరు పోర్టుని పూర్తి చేసి బందరు భవిష్యత్తుని మారుద్దామని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు విచ్చేసిన వారికి మన ఆతిథ్యం ఎలా ఉంటు-ందో చూపిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగినిపూడి బీచ్‌లో గురువారం నుంచి నాలుగురోలపాటు- మసూల బీచ్ ఫెస్టివల్ జరుగనుంది. జాతీయ జెండా ఆవిష్కరణ, క్రీడాకారులతో మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్ భారీ ర్యాలీ నిర్వహించారు. బీచ్ ఫెస్టివల్‌లో బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్, కయాకింగ్ వంటి పోటీలు నిర్వహించ నున్నారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా 80 అడుగుల అమరావతి ముఖద్వారం, పర్యాటకులని ఆకర్షిస్తూ పలు రకాల స్టాల్స్ ఏర్పాటు- చేశారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను మచిలీపట్నం వాసులు, టూరిస్టులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



# సీఎం, డిప్యూటీ సీఎంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు!

18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత ఆర్సీబీ ట్రోఫీ గెలిచింది. దీంతో బెంగళూరులోని విధాన సౌధా, చిన్నస్వామి స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ఈ సెలబ్రేషన్స్ చూసేందుకు ఆర్సీబీ అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఈ విజయోత్సవం విషాదంగా మారింది. స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించారు. ఈ భయంకరమైన విషాదం నేపథ్యంలో ఇప్పటివరకు ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదు. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , డీకే శివకుమార్ సహా కెఎస్సిఎ అధికారులపై కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రజల్లో ఉన్న ఎమోషన్‌ను రాజకీయ లబ్ధి కోసం వాడుకునేందుకు విధాన సౌధ ముందు %=జదీ% ఆటగాళ్లను సత్కరించడం, చిన్నస్వామి స్టేడియంలో వారి విజయాన్ని జరుపుకోవాలనే తొందరపాటు నిర్ణయం, సరైన భద్రతను నిర్లక్ష్యం చేయడం వలన సుమారు 11 మంది మరణించారు. 30 మందికి పైగా గాయపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషాదానికి కారణమైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డు ఆఫీస్ బేరర్లు మరియు ఇతరులపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 106 కింద కేసు నమోదు చేసి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. తొక్కిసలాట విషాదం నేపథ్యంలో న్యాయవాది నటరాజ శర్మ కూడా ఈరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. ఈ కేసుకు సంబంధించి బెంగళూరులో హెూంమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర ఒక ప్రకటన చేస్తూ తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిందని ఆయన అన్నారు. ఈ తొక్కిసలాటలో ఇప్పటివరకు 11 మంది మరణించారు. ఈ ఘటనలో 56 మంది గాయపడి చికిత్స పొందుతున్నారు. వీరిలో 46 మంది చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన 10 మందికి చికిత్స కొనసాగుతోందని తెలిపారు.



# నచ్చితే గుండెల్లో పెట్టుకుని పూజించుకోండి..

11 మందిని బలితీసుకున్న బెంగుళూరు తొక్కిసలాట.. మనకేమని సందేశం ఇచ్చినట్టు..? పదేళ్లయినా నిండని పసివాడు మృతదేహమై కనిపిస్తే అతడి కుటుంబానికి ఎదురయ్యే దుఃఖానికి ఏమని ఖరీదు కట్టగలం..? విజయోత్సవాలు కాస్తా విషాదాంతాలుగా మారడాన్ని, అభిమానాలే ఆయుష్షు తీసుకోవడాన్ని ఏమని అర్థం చేసుకోగలం..?అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ గెలిచి.. టైటిల్ కొట్టి.. అదే జోష్‌లో ట్రోఫీ నెత్తిన పెట్టుకుని తొలిసారి బెంగళూరుకు వచ్చిన ఆర్సీబీ టీమ్‌కి సన్మాన కార్యక్రమం.. వేదిక బెంగళూరు చిన్నస్వామి స్టేడియం. చివరికది పెను విషాదంగా మారి 11 మంది అభిమానుల సంతాప సభ ఔతుందని ఎవరనుకున్నారు? 50 మంది స్ట్రెచర్ల మీద ఆస్పత్రికి తరలివెళ్తారని ఎవరనుకున్నారు?ఎన్నో పరాభవాలు చూశాక%ౌ% 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత తమ అభిమాన జట్టు టైటిల్ కొట్టిందంటే ఆ కిక్కే వేరు. సెలబ్రేట్ చేసుకుని తీరాల్సిన సంబరమే అది. కానీ.. అక్కడుండాల్సిన కనీస విచక్షణ ఏమైనట్టు? గేట్లు బద్దలయ్యేలా దూసుకెళ్లి లాఠీచార్జికి సైతం లొంగనంత సాహసం ఎవరు చేయమన్నట్టు? ఒక్కో మృతుడి కుటుంబానికీ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది కన్నడ ప్రభుత్వం. పరిహారాలెలాగూ వస్తాయి.. పోయిన ప్రాణాలు తిరిగి రావుగా?సినిమా రిలీజులు కూడా అభిమానుల చావును కోరుకుంటే దాన్నేమనాలి? తమ ఆరాధ్య నటుడి సినిమా ఫస్ట్‌డే ఫస్ట్ షో చూద్దామని ఆశపడ్డ ఒక చిన్నోడు, తొక్కిసలాటకు చిక్కి, ఇప్పుడు జీవచ్ఛవంలా మారాడు. మొన్నీమధ్యే బిగ్‌బాస్ ఫేమ్ ఒకరు టైటిల్ గెల్చుకున్న ఆనందంలో ఊరేగింపు చేసుకుంటే అతగాడి అభిమానుల ఓవరాక్షన్ మిగతావాళ్లకు ప్రాణాంతకంగా మారింది. అతిభక్తితో మితిమీరిన విశ్వాసాలతో స్వామీజీల ఆశీర్వాదాల కోసం ఎగబడ్డప్పుడు కూడా తొక్కిసలాట ట్రాజెడీలే క్లయిమాక్సులౌతాయి. రాజకీయ పార్టీల ప్రచార సభలకు, సినిమా ఆడియో ఫంక్షన్లకు వెళ్లి తిరిగొస్తున్నప్పుడు రోడ్డుప్రమాదాల్లో పోయే ప్రాణాలు కూడా విలువ కట్టలేనివే!సినిమా సెలబ్రిటీలు, క్రికెటర్లు అంటే ఎందుకంత మోజు? ఎదురుగా లక్షలాది మంది కనిపిస్తున్నా చంటిపిల్లలు, కుక్కపిల్లలతో వస్తారా? క్రికెట్‌ను క్రికెట్‌లాగే చూడాలి. కిక్కు కావాలంటే కేరింతలు కొట్టాలి.. అల్లరి చేయాలి. అంతేగానీ అర్ధరాత్రి అపరాత్రీ చూసుకోకుండా ఎగేసుకుంటూ పోతే ఇదిగో ఇవేగా పర్యవసానాలు?ఇలా వెర్రెక్కిపోయే పిచ్చి అభిమానుల్లో ఎదిగీ ఎదగని కుర్రాళ్లున్నట్టే%ౌ% బాగా చదువుకున్నవాళ్లు, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసేవాళ్లు కూడా ఉండడం ఒక విషాదం. మనం ఇలా పిచ్చిగా అభిమానించడం వల్లే వాళ్ల పాపులారిటీలు పెరిగి సెలబ్రిటీలౌతారు. అభిమాన హీరోల ప్రతీ మూమెంట్‌ను సెలబ్రేట్ చేసుకోబోయి మనమే ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నాం. మన అత్యుత్సాహాలే మన పాలిట మృత్యువులౌతున్నాయా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

## బాధిత కుటుంబాలకు ఆర్సీబీ, కేఎస్సీఏ సంతాపం

### రూ.5 లక్షల నష్ట పరిహారం ప్రకటన

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తొలిసారి ఐపీఎల్ కప్ గెలిచిన సందర్భంగా నిర్వహించిన సంబరాలలో మరణించినవారి సంఖ్య 11కి చేరింది. అలాగే 30 మందికి పైగా గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి ముగిసిన ఫైనల్లో మాజీ రన్నరప్ పంజాబ్ కింగ్స్ పై 6 పరుగుల తేడాతో ఆర్సీబీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఈ మధ్యాహ్నం.. బెంగళూరుకు సిటీకి చేరుకున్న క్రికెటర్లకు అభిమానులు పెద్దయెత్తున స్వాగతం పలికారు. క్రికెటర్లు చిన్నస్వామి స్టేడియానికి చేరుకున్న క్రమంలో అభిమానులు భారీగా తరలిరావడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఇందులో ప్రాణనష్టం సంభవించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఆర్సీబీ ఫ్రాంచైజీ, కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్సీఏ) నష్ట పరిహారాన్ని ప్రకటించింది. సంబరాల సందర్భంగా తొక్కిసలాట జరిగి అభిమానులు మరణించడంపై ఫ్రాంచైజీ, కేసీఏ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్ట పరిహారాన్ని ప్రకటించాయి. ఈ సాయం పోయిన ప్రాణాలకు రీప్లేస్ లాంటిది కాదని, దుఖ సమయంలో మరణించిన కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు ప్రయత్నమిదని సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి. ఇక తొక్కిసలాట జరగడంతో చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో జరగాల్సిన అభినందన సభ, క్రికెటర్ల వ్యాఖ్యానం కూడా రద్దు చేశారు. తాజా తొక్కిసలాట ఘటనపై ఆర్సీబీ అభిమానులతోపాటు క్రికెట్ ప్రేమికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 18 ఏళ్ల తర్వాత కప్ గెలిచిన ఆనందం కంటే తోటి అభిమనులు చనిపోవడం కలిచి వేస్తుందని పేర్కొన్నారు. ఇక పెద్ద సంఖ్యలో అభిమానులు వస్తారన్న అంచనాతో పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నా ఈ ప్రమాదం జరిగింది. ఆటగాళ్లు నగరంలోకి ఎంటరైనప్పటి నుంచి అభిమానులు వారితోపాటే గుంపులు గుంపులుగా స్వాగతం చెప్పారు. అలాగే సీఎంతో సమావేశం అనంతరం ఓపెన్ టాప్ లో పర్యటన చేయాల్సి ఉండగా, రద్దీ కారణంగా దీన్ని కూడా రద్దు చేశారు. అయితే క్రికెటర్లను చూడాలనే స్టేడియానికి పెద్దయెత్తున అభిమానులు చేరుకోవడం, ఈ క్రమంలో ఎత్తైన గోడలు, చెట్లు, ముళ్లె కంచెలు ఎక్కడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

# మాస్టర్ బ్లాస్టర్ జట్టుకు కెప్టెన్ గా జితేష్ శర్మ

ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తొలి టైటిల్ అందించిన వికెట్ కీపర్ కం బ్యాటర్ జితేష్ శర్మ ఇప్పుడు తన హెూం గ్రౌండ్ లో సంచలనం క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యాడు. జితేష్ శర్మ విదర్భ ప్రొ టీ20 లీగ్ 2025లో నీకూ మాస్టర్ బ్లాస్టర్ జట్టుకు కెప్టెన్ గా ఆడనున్నాడు. నాగ్ పూర్ లోని వీసీఏ స్టేడియం, జమ్తాలో జూన్ 5 నుంచి 15 వరకు జరిగే ఈ లీగ్ లో 6గురు పురుషుల జట్టు, మూడు మహిళల జట్టు పాల్గొంటాయి. ఐపీఎల్ 2025లో 261రన్ 176.35 స్ట్రైక్ రేట్ తో ఫినిషర్ గా రాణించిన జితేష్, విదర్భ లీగ్ లో కూడా తన ఫామ్ ను కొనసాగించేందుకు సిద్ధమవుతున్నవాడు. మాస్టర్ బ్లాస్టర్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు. సంజయ్ రామస్వామి ఈ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. జితేష్‌కు ఇప్పటికే కెప్టెన్సీ అనుభవం ఉంది. ఐపిఎల్‌లో పంజాబ్ కింగ్స్, ఆర్‌సిబిలకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. జితేష్ శర్మ జట్టు జూన్ 6న %చీజుజూ% మాస్టర్ బ్లాస్టర్ లీగ్‌లో భారత్ రేంజర్స్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:45 గంటలకు ప్రారంభమవుతుంది. విదర్భ ప్రో %ు%20 లీగ్ ప్రారంభ మ్యాచ్‌లో, పగారియా స్ట్రైకర్స్ నాగ్‌పూర్ టైటాన్స్‌తో తలపడనుంది. జితేష్ శర్మ మంచి ఫామ్‌లో ఉన్నాడు. %ఖూ% 2025లో బాగా రాణించాడు. %ఖూ%లో 15 మ్యాచ్‌ల్లో 261 పరుగులు చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్‌పై 33 బంతుల్లో 85 పరుగులు చేశాడు, అందులో 8 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. అతని కారణంగానే జట్టు మ్యాచ్ గెలవగలిగింది. దీనితో పాటు, ఫైనల్‌లో జితేష్ 10 బంతుల్లో 24 పరుగులు కూడా చేశాడు. ముఖ్యమైన సందర్భాలలో అతను ఉపయోగకరమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. జితేష్ శర్మ వంటి నాయకులు జట్టుకు మార్గనిర్దేశం చేయడం మాకు గర్వకారణమని, ప్రేరణ, పోటీ, కొత్త హీరోలతో నిండిన సీజన్ కోసం మేము ఎదురు చూస్తున్నామని %చీజుజూ% మాస్టర్ బ్లాస్టర్స్ యజమాని ఆనంద్ జైస్వాల్ అన్నారు. విదర్భ ప్రో %ు%20 లీగ్ జియో సినిమా, ఫ్యాన్‌కోడ్, వేవ్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కోసం అందుబాటులో ఉంటుంది. అభిమానులు %ణణ% స్పోర్ట్స్‌లో కూడా మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారంలో చూడవచ్చు.



# మ్యాచ్‌లో రికెల్టన్ అర్ధశతకం

2025లో మెరిసిన ముంబై ఇండియన్స్ ఆటగాడు ర్యాన్ రికెల్టన్, ఇప్పుడు %×జజ% వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (%ఔజ%) ఫైనల్ 2025కి ముందు జింబాబ్వేతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో అద్భుతంగా అర్ధశతకం సాధించి ప్రోటీస్ జట్టుకు అతను ఎంత కీలకమో మరోసారి రుజువు చేశాడు. ఐపీఎల్‌లో తొలి సీజన్‌నే ఆడుతూ ?1 కోటి విలువైన రిక్రూట్‌గా ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ ఆర్డర్‌ను నడిపించిన రికెల్టన్, మొత్తం 14 మ్యాచ్‌లలో 388 పరుగులు చేసి మూడు అర్ధశతకాలు సాధించాడు. అత్యధికంగా 62లి స్కోరు నమోదు చేసిన ఈ ఎడమచేతి ఆటగాడు, 30 సగటుతో 150 స్ట్రైక్ రేట్‌తో ఆటను చక్కగా మలచాడు. ఈ %ఖూ% ఫామ్‌ను కొనసాగిస్తూ, లార్డ్స్‌లో జింబాబ్వేపై జరిగిన వార్మప్ మ్యాచ్‌లో కూడా అర్ధశతకంతో మెరిశాడు. ప్రారంభ ప్రారంభంలో క్యాచ్ డ్రాప్ అయినా, ఆ ఆనందాన్ని సద్వినియోగం చేసుకున్న రికెల్టన్ 62 పరుగులతో తన నైపుణ్యంతో సమర్థించుకున్నాడు. 28 ఏళ్ల ఈ యువ ఆటగాడు ఇప్పుడు లార్డ్స్‌లో జరగబోయే %ఔజ% ఫైనల్‌కి దక్షిణాఫ్రికా కంపెనీ ఓపెనర్‌గా భారీ బాధ్యతను భుజాలపై వేసుకుంటున్నాడు. జూన్ 11 నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభమయ్యే ఈ పలు ఆశల పోరులో ప్రోటీస్ తమ తొలి టైటిల్ గెలవాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఆస్ట్రేలియా గత సారి భారత్‌ను ఓడించి టైటిల్ గెలుచుకున్న నేపథ్యంలో, టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో బరిలోకి దిగుతోంది. దక్షిణాఫ్రికా తన తుది సన్నాహకాల్లో భాగంగా క్రికెట్ దిగ్గజం స్టువర్ట్ బ్రాడ్‌ను కన్సల్టెంట్‌గా నియమించింది. 2023లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పిన బ్రాడ్, జూన్ 9న లార్డ్స్ వేదికగా ప్రోటీస్ శిక్షణ శిబిరానికి హాజరయ్యే విధంగా ఏర్పాట్లు జరిగాయి. అతని విలువైన అనుభవం, ముఖ్యంగా టెస్ట్ ఫార్మాట్‌లో 600కి పైగా వికెట్లు తీసిన బ్యాక్‌గ్రౌండ్ దృష్ట్యా, కెప్టెన్ టెంబా బావుమా సారథ్యంలో ఆస్ట్రేలియాపై విజయాన్ని సాధించేందుకు కీలకంగా మారనుంది. ఈలా %ఖూ%లో మంచి ఫామ్‌తో రికెల్టన్, అలాగే బ్రాడ్ వంటి అనుభవజ్ఞుల మద్దతుతో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా జట్టు తన స్థాయిని చాటేందుకు సిద్ధమవుతోంది.

# ముందే హెచ్చరించిన గౌతమ్ గంభీర్!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) విజయోత్సవ సంబరాలు విషాదంగా ముగిసాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం బయట చోటు చేసుకున్న తొక్కిసలాటలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది అభిమానులు స్టేడియం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిలాసట జరిగింది. ఈ అనూహ్య ఘటనతో ఆర్‌సీబీ సంబరం చిన్నబోయింది. %జ%ఐపీఎల్ 2014 సీజన్‌లో గౌతమ్ గంభీర్ సారథ్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలిచింది. ఈ విజయాన్ని కేకేఆర్ సెలెబ్రేట్ చేసుకుంది. ఈడెన్ గార్డెన్స్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించింది. అయితే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో అభిమానులు ఈడెన్ గార్డెన్స్‌కు తరలివచ్చారు. అభిమానులను కట్టడి చేసేందుకు పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకున్నా.. అభిమానులపై పోలీసులు లాఠి చార్జ్ చేయడంపై గంభీర్ ఆవేదనకు గురయ్యాడు. ఈ ఘటనపై హిందూస్తాన్ టైమ్స్ దినపత్రికకు రాసిన కాలమ్‌లో విచారం వ్యక్తం చేశాడు. భవిష్యత్తులో ఇలాంటి వేడుకల్లో పాల్గొనని పేర్కొన్నాడు. 'కేకేఆర్ సన్మాన కార్యక్రమంతో కోల్‌కతా ప్రజలకు కలిగిన అసౌకర్యం పట్ల నేను నిరాశ చెందాను. భారత క్రికెట్ అభిమానులు.. ఈ ఆటకు అత్యంత ముఖ్యమైన వాటాదారులు. కానీ వారిని సరిగ్గా ట్రీట్ చేయలేదు. అమాయకులపై లాఠీ ఛార్జ్ జరిగింది. దేవుడి దయతో కేకేఆర్ టీమ్ ఎన్నో ట్రోఫీలు గెలుస్తుంది. కానీ నేను మాత్రం ఇలాంటి సన్మాన కార్యక్రమాలతో పాటు విజయోత్సవ వేడుకల్లో పాల్గొనను'అని గంభీర్ తన కాలమ్‌లో ప్రస్తావించాడు. తాజాగా ఆర్‌సీబీ విజయోత్స వేడుకల్లో తొక్కిసలాట జరగడంతో గంభీర్‌కు సంబంధించిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. విజయోత్సవ వేడుకలను పూర్తిగా రద్దు చేయాలని నెటిజన్లు కోరుతున్నారు.

# చరిత్ర సృష్టించిన నొవాక్ జకోవిచ్..!



సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ 2025 టోర్నీలో సెమీఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు. బుధవారం జరిగిన పురుషుల క్వార్టర్ ఫైనల్లో 38 ఏళ్ల వయసున్న నొవాక్ జకోవిచ్ 4-6, 6-3, 6-2, 6-4తో ప్రపంచ మూడో ర్యాంకర్ అయిన అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)ని ఓడించాడు. ఈ విజయంతో జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 100 విజయాలు పూర్తి చేసుకున్నాడు. రఫెల్ నాధల్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా జకోవిచ్ నిలిచాడు. అంతేకాకుండా జకోవిచ్‌కు ఇది 51వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్. ఇది ఒక కొత్త రికార్డు. మూడు గంటల పాటు హెూరాహెూరీగా సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. తొలి సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన జ్వెరెవ్ 6-4తో సొంతం చేసుకున్నాడు. మొదటి సెట్ కోల్పోయిన తర్వాత జకోవిచ్ తన ఆటను మెరుగుపర్చుకున్నాడు. అద్భుతమైన డ్రాప్ షాట్స్, బలమైన డిఫెన్స్‌తో జ్వెరెవ్‌ను ఇబ్బంది పెట్టాడు. జకోవిచ్ తన అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌పై పట్టు సాధించాడు. కీలక సమయాల్లో బ్రేక్ పాయింట్లను మార్చుకోవడంలో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏఎస్‌లతో పాటు 42 విన్నర్లు కొట్టాడు. 29 తప్పిదాలు చేసిన జకోవిచ్.. 35 డ్రాప్ షాట్స్ ఆడి 121 పాయింట్స్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ 4 ఏస్‌లు, 38 విన్నర్స్ కొట్టాడు. 44 అనవసర తప్పిదాలు చేసిన జ్వెరెవ్.. 12 డ్రాప్ షాట్స్ మాత్రమే ఆడి 101 పాయింట్స్ సాధించాడు. సెమీఫైనల్లో ప్రపంచ నెంబర్ వన్, జాన్నిక్ సిన్నర్(ఇటలీ)తో జకోవిచ్ తలపడనున్నాడు. బుధవారమే జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో సిన్నర్ 6-1, 7-5, 6-0 అలెగ్జాండర్ బుబ్లిక్(కజకిస్థాన్)ను చిత్తు చేశాడు. సిన్నర్ ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. జకోవిచ్, సిన్నర్ మధ్య హెడ్-టు-హెడ్ రికార్డు 4-4తో సమంగా ఉంది. అయితే ఈ ఇద్దరి మధ్య జరిగిన గత మూడు మ్యాచ్‌ల్లో సిన్నర్ గెలవడం గమనార్హం. ఈ క్రమంలోనే సెమీఫైనల్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే మూడు సార్లు ఫ్రెంచ్ ఓపెన్ సాధించిన జకోవిచ్.. 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌పై కన్నేసాడు. మరో సెమీఫైనల్లో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్, ఇటలీకి చెందిన లోరెంజో ముసెట్టి తలపడుతున్నారు.






# హరిహర వీర మల్లు మరోమారు వాయిదా?

## విజువల్ ఎఫెక్ట్ పనులు అసంపూర్తితో నిర్ణయం

ఈ నెల 12న రావాల్సిన 'హరిహర వీర మల్లు' వాయిదా పడినట్టే కనిపిస్తోంది! విజువల్ ఎఫెక్ట్స్ పనులు పూర్తి కాకపోవడంతో మరోమారు సినిమాని వాయిదా వేయాలని నిర్ణయించారు. కొత్త తేదీ ఖరారుపై ప్రస్తుతం చిత్రబృందం కసరత్తులు చేస్తోంది. వచ్చే నెలలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తేదీపై స్పష్టత వచ్చిన వెంటనే చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది. ఐదేళ్ల కిందట మొదలైన ఈ సినిమా, సుదీర్ఘకాలం సెట్స్‌పైనే ఉంది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. 12న విడుదల చేయాలని నిర్ణయించిన చిత్రబృందం, ఆ మేరకు ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించింది. అయితే . పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. నిధి అగర్వాల్ కథానాయిక. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎమ్.రత్నం సమర్పకులు. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ చిత్రానికి కీరవాణి స్వరకర్త. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఓజీ' చిత్రీకరణ వడివడిగా సాగుతోంది. ఇటీవలే ముంబయి షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురువారం నుంచి విజయవాడలో చిత్రీకరణ చేసుకోనుంది. ఈ షెడ్యూల్‌తోనే సినిమా పూర్తి కానున్నట్టు సమాచారం. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు ఇటీవలే నిర్మాత అధికారికంగా ప్రకటించారు.




# రొటీన్ గ్యాంగ్‌స్టర్ మూవీ థగ్‌లైఫ్

మణిరత్నం లెవల్‌ను అందుకోలేక పోయిన కథకమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన నాయకన్ సినిమా దాదాపు 38 ఏళ్ల క్రితం విడుదలై సూపర్ హిట్ అయింది. ఇప్పుడు వీరిద్దరూ కలిసి థగ్ లైఫ్ అనే సినిమాను రూపొందించారు. త్రిష, అభిరామి హీరోయిన్‌లుగా, శింబు, జోజూ జార్జ్ వంటి వారు ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను స్వయంగా కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఈ సినిమాను నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి విడుదల చేశారు. నాయకన్ కంటే ఇది ఉత్తమ సినిమా అని కమల్ హాసన్ పేర్కొనడంతో అందరి దృష్టి ఈ సినిమాపై పడింది. తన అన్న మాణిక్యం (నాజర్)తో కలిసి రంగరాయ శక్తి రాజు (కమల్ హాసన్) ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్‌గా ఒక గ్యాంగ్‌ను నడుపుతూ ఉంటాడు. సదానంద్ (మహేష్ మంజ్రేకర్) గ్యాంగ్‌తో గ్యాంగ్ వార్ నడుస్తూ ఉంటుంది. ఇలాంటి ఒక సందర్భంలో సదానంద్, శక్తి రాజు గ్యాంగ్‌ను పట్టించే ప్రయత్నం చేస్తాడు. అయితే, శక్తి రాజు ఒక చిన్నారిని (శింబు) కవచంగా ఉపయోగించి తప్పించుకుంటాడు. ఆ రోజు నుంచి ఆ చిన్నారి అమర్‌ను సొంత కొడుకులా పెంచుతాడు. అయితే, ఒకసారి జరిగిన దాడిలో శక్తి రాజు అమర్‌పై అనుమానం వ్యక్తం చేస్తాడు. అదే సమయంలో, తన తండ్రిని చంపింది శక్తి రాజేనని తెలుసుకున్న అమర్, శక్తి రాజును ఒక లోయలోకి తోసేస్తాడు. చనిపోయాడు అనుకుని తిరిగి వచ్చి అతని సామ్రాజ్యం అంతటినీ తన కంట్రోల్‌లోకి తెచ్చుకుంటాడు. రెండేళ్ల తర్వాత తిరిగి వచ్చిన శక్తి రాజు మళ్ళీ తిరిగి తన సామ్రాజ్యాన్ని దక్కించుకున్నాడా? తన భార్య లక్ష్మి (అభిరామి), కూతురు మంగా? ఏమయ్యారు? చిన్నప్పుడే తప్పిపోయిన అమర్, చంద్ర మళ్లీ కలిసారా? చివరికి ఏం జరిగింది? అనేది బిగ్ స్క్రీన్ కథ.నిజానికి ఇలాంటి కథలు మనం గతంలో ఎన్నో సినిమాలలో చూశాం. ఇందులో కూడా అలాంటి గ్యాంగ్‌స్టర్ డ్రామాతోనే కథను నడిపించే ప్రయత్నం చేశాడు దర్శకుడు మణిరత్నం. ఒక గ్యాంగ్‌స్టర్, ఒక చిన్న కుర్రాడి కారణంగా ప్రాణాలు కాపాడుకుని, అతన్ని తనతో పాటు పెంచుకుంటూ ఉంటాడు. కొన్నాళ్లకు చాకులా తయారైన ఆ కుర్రాడు, గ్యాంగ్‌స్టర్ మీద తిరగబడతాడు. చివరికి వారిద్దరిలో ఎవరు మిగిలారు అనే లైన్‌తో ఇప్పటికే మనం ఎన్నో సినిమాలు చూశాం. ఈ సినిమాను కూడా దాదాపు అదే లైన్‌తో రాసుకున్నాడు మణిరత్నం. దానికి కాస్త ఫ్యామిలీ ఎమోషన్స్ టచ్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. నిజానికి ఈ ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా గ్యాంగ్‌స్టర్ డ్రామాలో సరిగ్గా మిక్స్ అవ్వకపోవడంతో, ఇది ఒక సంపూర్ణమైన మణిరత్నం సినిమా ఫీలింగ్ కలగదు.

# అనుష్కను చూస్తూ కిందపడ్డ వాహనదారులు

## వేదం పోస్టర్‌పై నెట్టింట వైరల్

టాలీవుడ్ గోల్డెన్ లెగ్ అనుష్క గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. మామూలుగా ఒక హీరోయిన్ కెరీర్ మహా అయితే పదేళ్లు ఉంటుంది. గట్టిగా నిలుపుకుంటే మరో 5 ఏళ్లు వేసుకున్న 15 ఏళ్లు. కానీ.. అనుష్క మాత్రం దాదాపు రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో ఉంది. ఉండటమే కాదు.. ఇప్పటికీ అంతే క్రేజ్.సరిగ్గా 2005లో 'సూపర్' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ- ఇచ్చి.. ఫస్ట్ సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత మళ్లీ అనుష్క వెనక్కి తిరిగి చూసుకోలేదు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో హిట్ల మీద హిట్లు- కొడుతూ తిరుగులేని క్రేజ్ సంపాదించుకుంది. అయితే కెరీర్ పీక్స్‌లో ఉండగా పాత్రల విషయంలో హీరోయిన్ లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ అనుష్క తన కెరీర్‌లో కొన్ని రిస్కీ పాత్రలు కూడా చేసింది. అందులో ఆమె 'వేదం' చిత్రంలో చేసిన వేశ్య పాత్ర ఒకటి.దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన ఈ సినిమా రిలీజ్ అయి 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. దీంతో రీసెంట్ ఈ మూవీ రిలీజ్ టైం లో జరిగిన సంఘటన ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే వేదం సినిమా ప్రమోషన్ కోసం అనుష్క పసుపు చీర కట్టుకొని వెనక్కి తిరిగి చూస్తున్న స్టిల్స్ తెగ వాడేశారు. పలు చోట్ల హోర్డింగ్ కూడా పెట్టారు. అయితే పంజాగుట్ట సర్కిల్ లో కూడా అనుష్క వెనక్కి తిరిగి చూస్తున్న ఫొటోని చాలా పెద్దగా పెట్టారట. అయితే అనుష్కని చూస్తూ వాహనదారులు యాక్సిడెంట్ల బారిన పడడం అప్పట్లో చర్చనీయాంశం అయింది. దాదాపు 40 మైనర్ యాక్సిడెంట్స్ జరగడంతో పోలీసులు ఏఃఈ అధికారులతో కలిసి అనుష్క హోర్డింగ్ ని తొలగించారట. ప్రజెంట్ ఈ న్యూస్ తెగ వైరల్ అవుతుంది.



# రామోజీ ఫిలిం సిటీలో అగ్రతారల సందడి

## ఆన్టీఆర్, ప్రభాస్ మూవీల చిత్రీకరణ



రామోజీ ఫిల్మ్ సిటీలో సినిమాల చిత్రీకరణ హంగామా మళ్లీ మొదలయ్యింది. ప్రస్తుతం ప్రభాస్, ఎన్టీఆర్‌లు ఆర్ఎఫ్‌సీలో షూటింగ్‌లతో బిజీబిజీగా గడుపుతున్నారు. భారీ అంచనాలున్న పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ చిత్రం ముందు వరుసలో ఉంటుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ అధికారికంగా మొదలైంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో భాగంగానే ఎన్టీఆర్‌తో పాటు- 2000 మంది జూనియర్ ఆర్టిస్ట్‌లతో ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. పీరియాడిక్ మాస్ యాక్షన్ కథతో రూపొందుతున్న ఈ సినిమాకి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఇందులో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత్ నటిస్తున్నట్లు- సమాచారం. కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జూన్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సలార్', 'కల్కి2898ఏడీ' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరు మీదున్నారు అగ్రకథానాయకుడు ప్రభాస్. ప్రస్తుతం ఆయన తన తదుపరి సినిమాల చిత్రీకరణల్ని పరుగులు పెట్టిస్తున్నారు. ప్రభాస్ ప్రధాన పాత్రలో హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫౌజీ' (వర్కింగ్ - టైటిల్). 1940ల కాలం నాటి కథతో వార్ డ్రామాగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రంతోనే ఇమాన్వి కథానాయికగా పరిచయం అవుతోంది. తాజాగా ఈ సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను ఆర్ఎఫ్‌సీలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభాస్‌పై టింబర్ డిపో నేపథ్యంలో సాగే సన్నివేశాలను తీర్చిదిద్దుతున్నారు. చారిత్రక అంశాలతో ముడిపడిన ఈ సినిమాలో మిథున్



# పళని మురుగన్‌ను దర్శించుకున్న సూర్య

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య పళని మురుగన్ ఆలయాన్ని దర్శించుకున్నాడు. గురువారం ఉదయం పళనికి వెళ్లిన సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత నాగవంశీ మురుగన్‌ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు సూర్య రాకతో ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.రెట్రో సినిమా తర్వాత సూర్య తన తదుపరి చిత్రం వెంకీ అట్లూరితో చేస్తున్న విషయం తెలిసిందే. 'సూర్య 46 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఈ సందర్భంగానే సూర్య స్వామివారి ఆశీస్సులు తీసుకోవడానికి ఆలయాన్ని సందర్శించినట్లు తెలుస్తోంది. ఆలయానికి వచ్చిన సూర్య క్లీన్ షేవ్‌లో కనిపించడంతో ఆయన లుక్ వైరల్‌గా మారింది. సూర్య 46 షూటింగ్ జూన్ 9న స్టార్ట్ కాబోతున్నట్లు- సమాచారం. ఈ చిత్రంలో సూర్య సరసన మమితా బైజు కథానాయికగా నటిస్తున్నారు. అంతేకాకుండా, రవీనా టాండన్ మరియు రాధిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685